
వార్త
ఆదివారం
6 ఆగస్టు, 2023



# 'ధరా' భారం

# రవితేజ సరసన పూజహెగ్డే!



వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో సందడి చేసిన పూజహెగ్డే వరుస పరాజయాలతో కొంత కాలంగా వెనుకబడిపోయింది. మొన్నటి వరకు బుట్టబొమ్మగా ఓ వెలుగు వెలిగిన పూజ కెరీర్ ఒక్కసారిగా ఊహించని మలుపు తీసుకుంది. ఇలాంటి సమయంలో ఆమెకు మాస్ మహారాజా రవితేజ సినిమాలో నటించే అవకాశం వచ్చినట్లు తెలుస్తోంది. 'డాన్ శీను', 'బలుపు', 'క్రాక్' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని నాలుగోసారి చేతులు కలిపారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పూజను ఎంపికను చేసినట్లు సమాచారం. ఈ విషయం నిజమైతే వీరిద్దరు జంటగా నటించే సినిమాయే మొదటిది అవుతుంది. ఈ చిత్ర విజయం పూజకు ఎంతో కీలకం.

తారాతీరం



# రజనీ సినిమాలో నాని?

ప్రస్తుతం కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా పలు సాలిడ్ చిత్రాలు చేస్తున్న సంగతి తెలిసిందే. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్‌తో చేసిన 'జైలర్' విడుదలకు సిద్ధమవగా, తరువాతి సినిమా 'జై భీమ్' దర్శకుడు టి.జె.జ్ఞానవేల్ ముత్తుతో ఓ సాలిడ్ సబ్జెక్ట్‌ని చేయబోతున్న విషయం విదితమే.

అయితే ఈ సినిమా పలు నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కుతూ ఉండగా ఈ చిత్రంలో నాచురల్ స్టార్ నాని నటించనున్నట్లు సమాచారం. ఇందులో ఓ ముఖ్య పాత్ర కోసం నానిని అప్రోచ్ అయినట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా చిత్రం 'దసరా'తో నాని సెన్సేషనల్ హిట్ కొట్టి తన కెరీర్‌లో 30వ సినిమా 'హాయ్ నాన్న'తో బిజీగా వున్నాడు.

ఆదివారం వార్త
6 ఆగస్టు, 2023

## మంచి ముత్యాలు

నిరంతరం ఎదుటివారి మెప్పు కోసం
తాపత్రయపడేవాడు తన సహజగుణాలు,
మనశ్శాంతి కోల్పోతాడు.

- గాండేకర్

## విషయ విశేషం

అదృశ్యం కానున్న దేశం.... 4
'సంఘీ'భావం....5
అక్రమ కట్టడాలతోనే ముంపు సమస్య
కవర్ స్టోరీ..6
'ధరా' భారం
సాహిత్యం..11
తెలుగుతల్లికి 'శంకరంబాడి' మల్లెపూదండ
ఈవారం కవిత్వం..12
నిరీక్షణలో..!
జాతీయ పతాకాన్ని గౌరవిద్దాం...14
కథ.. 20
కన్యాదానం
అంబులెన్స్...23
సమస్యను బట్టిపరిష్కారం...24
ప్రపంచవింత 'చైనా మహాకుడ్యం'...25
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## భగవద్గీతను వినిపిస్తుంది



భగవద్గీతను చదివితే బాగానే ఉంటుంది కానీ ఆ శ్లోకాలను పలకడం కష్టం. దానికితోడు వాటి అర్థాలు కూడా తెలియవు కాబట్టి..చాలామంది భగవద్గీత అంటే ఇష్టం ఉన్నా..చదవడానికి ఆసక్తి చూపించరు. అలాంటివారికోసమే ఇప్పుడు 'స్పీకింగ్ భగవద్గీత' వచ్చింది. పదకొండు భాషల్లో, 108 భజనలతో, ప్రతి పదానికీ అర్థాన్ని తెలియజేసే విధంగా ఉంటుందీ స్పీకింగ్ భగవద్గీత. ఈ పుస్తకంతోపాటూ విజ్‌డమ్ ఫ్లూట్ పేరుతో చిన్న పరికరం కూడా వస్తుంది. ఆ పరికరాన్ని ఎప్పటికప్పుడు యూఎస్‌బీ సాయంతో ఛార్జింగ్ పెట్టుకుని, పుస్తకంలో ఉన్న బొమ్మలు లేదా పద్యాలపైన పెడితే చాలు. గీతాశ్లోకాలూ, భజనలూ హాయిగా వినొచ్చు. సౌండ్‌ను పెంచుకునీ, తగ్గించుకునే ఏర్పాటు కూడా ఉన్న ఈ భగవద్గీతను కానుకగా ఇవ్వడానికి ఎంతో బాగుంటుంది కదా!

## అలెర్జీకి చెక్!



వాతావరణం మారినప్పుడు, గాలిలో కాలుష్యం ఎక్కువగా ఉన్నప్పుడు చాలామందికి అలర్జీ బాధలు తప్పవు. అలర్జీలు తీవ్రమైతే కొందరికి ఉబ్బసం కూడా మొదలవుతుంది. అలెర్జీలకు, ఉబ్బసానికి ఇప్పటివరకు మందులు, ఇన్‌హేలర్‌లే గతి. అలెర్జీలకు పరిష్కారంగా ఎస్టోనియాకు చెందిన 'రెస్పిరే' కంపెనీ ఇటీవల మెడలో తొడుక్కునేందుకు వీలైన 'ఏ ప్లస్ వేర్' పేరుతో అలెర్జీ ఫిల్టర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇది మెడలో తొడుక్కున్నట్లయితే, గాలిలోని అలెర్జీకి కారణమయ్యే కణాలేవీ దీనిని దాటి ముక్కులోకి చొరబడలేవు. ఇందులోని హెపా ఫిల్టర్లు అలెర్జీలకు దారితీసే సూక్ష్మాతిసూక్ష్మకణాలను సైతం ఇట్టే లోపలకు పీల్చేసుకుని, గాలిని శుభ్రం చేస్తాయి. ఇది రీచార్జబుల బ్యాటరీ సాయంతో పనిచేస్తుంది. ఇది చార్జ్ కావడానికి గంటన్నర సమయం పడుతుంది. పూర్తిగా చార్జ్ అయ్యాక ఎనిమిది గంటల సేపు నిరంతరాయంగా పనిచేస్తుంది. దీని ధర రూ.10,795. దీనిని వాడటం మొదలుపెడితే అలెర్జీల కోసం మందులు వాడాల్సిన అవసరం దాదాపుగా ఉండదు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# అవీఇవీ



## అదృశ్యం కానున్న దేశం

**మరో** యాభై ఏళ్లలో ఆ దేశం ఉనికిలో ఉండకపోవచ్చు. పూర్తిగా సముద్రంలో మునిగిపోవచ్చు. ఇప్పటికే ఆ దేశం క్రమంగా సముద్రంలోకి కుంగిపోతోంది. ఆ దేశం ఏమిటి? ఎక్కడుంది అనుకుంటున్నారా? ఫిజీకి ఉత్తరాన వెయ్యి కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ సముద్రంలో ఉన్న ఈ చిన్న ద్వీపం దేశం పేరు 'తువాలు'. దీని విస్తీర్ణం 25 చదరపు కిలోమీటర్లు. జనాభా 11,900. ఈ దేశానికి ఒక విమానాశ్రయం ఉంది, వారానికి మూడు విమానాలు మాత్రమే ఇక్కడి నుంచి రాకపోకలు జరుపుతాయి. విమానాల రాకపోకలు లేని సమయంలో పిల్లలు రన్‌వే మీద ఆటలాడుకుంటూ కనిపిస్తారు. ఈ దేశం పర్యాటకంలో అత్యంత వెనుకబడిన దేశంగా ఐక్యరాజ్యసమితి ఇటీవల ప్రకటించింది. తువాలును ఏటా సందర్శించే పర్యాటకులు సగటున 3,700 మంది మాత్రమే. ఈ దేశంలోని ప్రధాన ద్వీపంలో మనుషులు నివసిస్తుంటారు. ఈ దేశంలో భాగంగా నాలుగు పడగవు దీవులు కూడా ఉన్నాయి. ఈ దేశంలో హోటళ్లు, రెస్టారెంట్ల సంఖ్య కూడా తక్కువే. విచిత్రమైన ప్రదేశాలను చూడాలనుకునే ఉబలాటం గల కొద్దిమంది తప్ప వినోదయాత్రల కోసం పర్యటనలకు వెళ్లేవారువరూ ఈ దేశంవైపు చూడరు. పర్యావరణ మార్పుల కారణంగా సముద్రజలాలు పెరుగుతూ వస్తుండటంతో ఈ దేశం మరో యాభైయ్యేళ్లలోగా పూర్తిగా నీట మునిగిపోతుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. కొన్ని దీవులు ఇప్పటికే సముద్రంలో కలిసిపోయాయి.

## గురకను నివారించే దిండు



**ఈ** దిండు గురక నివారిణి. దీని మీద తలపెట్టుకుని అదమరచి నిద్రించినట్లయితే, గురక బెడద ఉండదు. నిద్రలో అటూ ఇటూ కదిలేటప్పుడు తల ఎటు తిరిగితే అటువైపు ఈ దిండు తనంతట తనే సర్దుకుంటుంది కూడా. అమెరికన్ కంపెనీ 'ప్యూర్-లెక్స్' తయారు చేసిన ఈ దిండు ఆషామాషి దిండు కాదు. చాలా స్మార్ట్ దిండు. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేస్తుంది. ఇందులోని సెన్సర్లు నిద్రిస్తున్న వ్యక్తి తీరు తెన్నులను ఎప్పటికప్పుడు గుర్తిస్తాయి. గురక మొదలయ్యేట్లు ఉంటే..గురక నివారించేందుకు వీలుగా ఒకవైపు ఎత్తు పెరగడం, ఒకవైపు ఎత్తు కుదించుకోవడం చేస్తుంది. నిద్రిస్తున్న వ్యక్తి తల సౌకర్యవంతంగా ఉండేలా సర్దుకుంటుంది. గురక సమస్యతో బాధపడేవారికి ఈ దిండు చక్కని పరిష్కారం. దీని ధర రూ.11027.




## రోబో క్లీనర్లు

విద్యుత్తుతో పనిచేసే వాక్యూమ్ క్లీనర్లు ఇప్పటికే చాలాచోట్ల వాడుకలో ఉన్నాయి. ఇటీవల కాలంలో రోబో వాక్యూమ్ క్లీనర్ల కూడా అందుబాటులోకి వస్తున్నాయి. రోబో వాక్యూమ్ క్లీనర్లు గదిలోని చెత్తను పూర్తిగా తొలగించాక, వాటిలోని అర చెత్తతో నిండిపోతోంది. ఆ చెత్తను మనం తొలగించాల్సి ఉంటుంది. అయితే, చైనీస్ హైటెక్ కంపెనీ 'జియావోమీ' ఇటీవల సెల్ఫ్ క్లీనింగ్ రోబో వాక్యూమ్ క్లీనర్‌ను అందుబాటులోకి తెచ్చింది.

# 'సంఘీ' భావం



## అక్రమ కట్టడాలతోనే ముంపు సమస్య

చిన్నపాటి వర్షం వస్తే చాలు హైదరాబాద్ నగరంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాలు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నాయి. సుమారు రెండు దశాబ్దాల క్రితం ఈ సమస్య అంత గా ఉండేది కాదు. నదులు, నాలాలు ప్రవహించే ప్రాంతాల్లో ప్రకృతికి విరుద్ధంగా కట్టడాలు, ఆక్రమణల కు పాల్పడటం వంటి చర్యల వల్ల ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. నదులు, నాలాలు స్వేచ్ఛగా పారేందుకు ఉండాల్సి న స్థలాల ను ఆక్రమించడం, నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక తవ్వకాలను భారీ యంత్రాలు, లారీలతో కొనసాగించడం వల్ల సమతుల్యత లోపించి ముంపు ప్రమాదాలకు కారణంగా మారుతోంది. ఏదైనా ముంపునకు గురౌతుండంటే ఒకసారి లోతుగా అధ్యయనం చేస్తే అసలు విషయాలు వెలుగు చూస్తాయి. చెరువు శిఖం భూముల ను, నదుల గట్లను ఆక్రమించి నిర్మాణాలు చేయడం, నాలాల కబ్జాతో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం వంటివి చేపట్టడం వల్ల వర్షాల సీజన్‌లో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈసారి రుతు పవనాలు చాలా ఆలస్యంగా వచ్చాయి. రావడమే భారీ వర్షాలను మోసుకువచ్చాయి. దీనికి బంగాళాఖాతంలో అల్ప పీడనం తోడైంది. దీనితో హైదరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల్లో రికార్డు స్థాయి వర్షాలు కురిసాయి. ఆక్రమణలు. కబ్జాలు లేకుంటే ఈనీరు నేరుగా నదుల నుంచి సముద్రంలో కలిసేది. అయితే నీరు ప్రవహించడానికి వీలు లేకుండా అడ్డంకులు కలగడంతో వరద నీరు నివాస ప్రాంతాలకు, పంటచేలను ముంచెత్తుతూ ప్రవహించింది. గోదావరి, కృష్ణా కరకట్టలతో పాటు నగరంలో మూసీ పరివాహక ప్రాంతంలో అక్రమణలు పెద్ద ఎత్తున కనిపిస్తాయి. నగరంలో నాలాలు పరిధి గణనీయంగా కుచించుకుపోయింది. ఆక్రమణలు తొలగిస్తామని ప్రభుత్వాలు హడావిడి చేసిన ప్పటికీ కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నాయి. ఆక్రమణల్లో అధిక భాగం రాజకీయ ప్రముఖుల కనుసన్నలలోనే జరగడంతో వాటిని తొలగించేందుకు వీలు కుదరని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా ఆక్రమణదారులు స్థానికంగా ఓటరు గుర్తింపుకార్డులు పొందడంతో వారిని తొలగిస్తే తమ పదవులకు ముప్పు వాటిల్లుతుందన్న భయంతో కొందరు రాజకీయ వేత్తలు వీరికి అండగా నిలుస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో బస్తీల మీదుగా పెద్ద సంఖ్యలో నాలాలు ప్రవహిస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం జంటనగరాల మీదుగా సుమారు 370 కిలోమీటర్ల మేర నాలాలు ప్రవహిస్తు న్నాయి. వీటిపై సుమారు 15 వేల వరకు ఆక్రమణలను గుర్తించారు. ఇవన్నీ అనధికారికంగా నాలాలను ఆక్రమించి నిర్మించుకున్న గృహాలు. వీటన్నింటినీ తొలగించి నాలాలను విస్తరింప చేసి, 30 సెంటీమీటర్ల వర్షపాతం కురిసినా ఎటువంటి ముప్పు లేకుండా చేయాలంటే కనీసం 25 నుంచి 30 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయాల్సి ఉంటుంది. నాలాల సర్వే కోసం పలు సర్వే సంస్థలు అధ్యయనం చేసి నివేదికలు ప్రభుత్వానికి సమర్పించాయి, అయితే వీటిలో ఒక్క నివేదికను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేకపోయింది. రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మక నాలాల అభివృద్ధి పథకాన్ని చేపట్టింది. అయితే ఇది కేవలం రికార్డులకు మాత్రమే పరిమితం అయ్యింది. కొంత మేర పనులు ప్రారంభించినప్పటికీ ఆటంకాలు అధికం కావడం, రాజ కీయ వత్తిడిలు పెరగడంతో ఈ పథకం అమలు ప్రశ్నార్థకంగా మారింది. హైదరాబాద్‌లోనే కాకుండా తెలంగాణలో వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఆంధ్రాలో విజయ వాడ, తిరుపతి, విశాఖపట్నం, నెల్లూరు, కడప, అనంతపురం, కర్నూలు వంటి నగరాల్లో కూడా ఇదే సమస్య ఎదురౌతోంది. నదులను, నాలాలను ఆక్రమించి భవనాలు నిర్మించేవారిని ప్రభు త్వాలు అడ్డుకోలేకపోతున్నాయి. కర్నూలులో 2009లో వచ్చిన వరదలు నగరవాసుల జీవనాన్ని ప్రమాదంలో ముంచెత్తాయి. నగరంలో సుమారు రెండు అంతస్థులు దాటి తుంగభద్ర నది ప్రవహించింది. వందలాది మంది ఈ వరదల్లో మృతి చెందారు. ప్రస్తుతం వరంగల్ ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదే విధంగా ఉంది. మొరంచపల్లి గ్రామం కేవలం గంటన్నర సమయంలో నీటమునిగింది. అనేక మంది నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. పశు వులు పెద్ద సంఖ్యలో మృతి చెందాయి. రోడ్లు ఆనవాళ్లు కూడా కనిపించనంతగా దెబ్బతిన్నాయి. విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై నుంచి మున్నేరు వాగు ప్రవహించింది. గతంలో కూడా ఇదే ప్రాంతంలో వాగు పొంగి రాకపోకలకు అంతరాయం కలిగింది. నీరు ప్రవహించడానికి వీలు లేకుండా రోడ్డు నిర్మాణం జరగడంతో ఈ సమస్య తలెత్తుతోంది. విశాఖపట్నంలో సుమారు ఆరు గంటల పాటు భారీ వర్షం కురి యడంతో 30 శాతం నగరం ముంపు సమస్యను ఎదుర్కొంది. కోనసీమ జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్న కాలువలను ఆక్రమిం చారు. దీనితో ధవళేశ్వరం వద్ద నీటిని వదిలినప్పుడు అనేక గ్రామాలు నీటమునుగుతున్నాయి. చాలా గ్రామాలకు రాక పోకలు నిలిచిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో 15 నుంచి 25 రోజులు ఆయా గ్రామాలు ముంపులోనే ఉంటున్నాయి. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో జాప్యం, కొన్ని లోపాల వల్ల ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక ప్రాంతాలు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నాయి. వర్షాకాలం వస్తుందంటే చాలు చింతూరు పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురౌతున్నారు. ఇప్పటికే అనేక సంస్థలు వివిధ ప్రాంతాల్లో సర్వేలు నిర్వహించి నివేదికలు సమర్పించాయి. వీటిని పరిగణనలోకి తీసు కుని ఎటువంటి రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా ఆక్రమణలు, కట్టడాలు తొలగిస్తే భవిష్యత్తు తరాలకు మేలు చేసినట్లు అవుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# 'ధరా' భారం

నిత్యావసర వస్తువులకు అత్యధిక ధరలు అనేవి ఎప్పటికప్పుడు పెద్ద సమస్య. ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి నిద్రించేవరకు పౌరులకు ఎంతో అవసరమైనవి ఎన్నో ఉంటాయి. పప్పులు, కూరగాయలు, నూనెలు, ఇంధనం, పెట్రోలు..ఇలా అనేకం. అసలు 'అవసరం' అనడంలోనే ఆగ త్యం, ఆతృత, ఆవశ్యకం, ముఖ్యం అనేవి ధ్వని స్తాయి. అవి లేనిదే రోజు గడవదు. జీవనం ముందుకు సాగదు. తప్పనిసరి అనిపిస్తాయి. ఆ 'అవస రాలు' లభించకుంటే క్షణాలు యుగాల్లా గడిపినట్లు అనిపిస్తుంది. ఇంత ప్రధానమైనవి లేనపుడు బతుకు దుర్భరంగా తోస్తుంది. ధరలు అందు బాటులో లేని పరిస్థితి సామాన్యుడిలోని అసహనాన్ని తెరమీదకు తెస్తుంది. అందుకే 'నిత్యావ సరాల ధరల పెరుగుదల' వ్యక్తిగతంగా, సామాజికంగా, పాలనాపరంగా కూడా సమస్యాత్మకం. అత్యధిక జనసంఖ్య నిండిన మన దేశంలో ధరల పెంపు ఇంకా సూటిగా ధాటిగా చెప్పాలంటే పెనుసవాలు. పాలితులకు, పాలకులకు కూడా!

కవర్ స్టోరీ

జంధ్యాల శరత్‌బాబు

ధరల పెరుగుదల గురించి అనుకోనివారుండరు. సాధారణ పౌరులను అడిగినా, అడగకున్నా ఒకటే సమాధానం వస్తుంది. 'ఎంతమాత్రం భరించలేం' అని కదా మరి? కాస్తంత ఉడకేసుకోవాలంటే పప్పులుండాలి. కాస్తోకూస్తో కూరలూ కావాలి. వండుకునేందుకు నూనె ఉండాల్సిందే. అన్నింటికన్నా మించి, స్టౌవ్ వెలిగించేందుకు గ్యాస్ ఉండితీరాలి. ఇవన్నీ ఉంటేనే కదా ఆహార అవసరాలు తీరేది! కానీ భారతంలో జరిగిందీ, జరుగుతోంది ఏమిటి? పలు రకాల పప్పుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, కూరలకు అవసరమైన టమాటా, ఉల్లిపాయల రేట్లూ చుక్కల్ని అంటడం, వంట నూనెలైన వేరుశనగ, నువ్వుల, ఆవ, తదితరాల ధరలైతే 'బాబోయ్' అనిపించడం! ఎందుకిలా అని ప్రశ్నించుకుంటే ప్రాంతీయం మొదలు అంతర్జాతీయం దాకా అనేకానేక కారణాలు. వస్తూత్పత్తుల్లో సమస్యల తీవ్రత, రవాణా వ్యయాలు పెరిగిన స్థితి, వాతావరణ అననుకూలత, వాణిజ్యపరంగా అవాంతరాలు, ఇంకా ప్రత్యక్ష పరోక్ష ప్రభావాలు. ఒకవిధంగా ఇది సంక్షోభమే. భారత్‌లో, ఆమాటకొస్తే, ప్రపంచంలోనూ! బియ్యం, గోధుమలు, చక్కెర ధరలపైన ఏవిధమైన నియంత్రణా ఉండటం లేదు. ఇదంతా ఆహారలభ్యత మీద విపరీత ప్రభావం కలిగిస్తోంది. మనకు తెలిసిందే...ప్రపంచదేశాల్లో ముఖ్యంగా ఇక్కడ వ్యవసాయరంగ ప్రధాన ఉత్పత్తులకు ఎప్పుడూ నష్టాలే. వర్షాభావం, అకాలవర్షాలు, వరదల బెడద, మరెన్నో ప్రకృతి విపత్తులు రైతాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తూనే ఉన్నాయి. ఇందులో ఖరీఫ్, రబీపంట కాలాలన్న తేడా లేదు. దుక్కిదున్నడం, నేలను చదును చేయడం, నీరు పెట్టడం, ఎరువులు వేయడం, పంట చేతికి వచ్చేదాకా అన్నివిధాలా శ్రమించడం. ఇన్ని చేసినా, దేనికీ భరోసా ఉండదంతే. అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతాలు ఎలాగూ తప్పదు. ఏదోరకంగా బయటపడినా, రైతులకు కనీస పెట్టుబడులూ దక్కవు. వీటన్నింటివల్లనే, ఆహార భద్రత సూచికలో మనదేశస్థానం చివర ఎక్కడో ఉంది. ఇదైతే ఆహార సరఫరా నిర్ధారణను సూచిస్తోంది. ప్రతీపౌరుడికీ ఆహార హక్కు ఉన్నా, జాతీయస్థాయిన



సంబంధిత భద్రతాచట్టం రూపొందినా, ఫలితం మాత్రం పలు కారణాల మూలాన అంతంత మాత్రమే. చక్కెరపూత ఎంత ఉన్నా, ఇదే చేదు నిజం! సమన్వయం ఎక్కడుంది? అంతెందుకు టమాటా ధరలతీరునే విశ్లేషించి చూద్దాం. ఒకే ఒక్కనెలలోనే దీనిరేటు మూడొందల శాతం పైగా పెరిగింది. మామూలు వ్యక్తులెవరూ కొనలేని, తినలేని దుస్థితి. అనేకమంది కొని తినడం మానేయాల్సి వచ్చిందన్నది కళ్లముందున్న వాస్తవం. వినియోగదారుల సంక్షేమాన్ని చూసే నేషనల్ కోఆపరేటివ్ కన్జూమర్స్ ఫెడరేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తపరచింది. వంటగది నుంచి టమాటా మటుమాయమవుతోందని విశ్లేషించిందా సంస్థ. ఇక బియ్యం ధరలైతే (అవి ఏరకమైనా సరే) క్వింటాల రేట్లు మరీ పెచ్చుపెరిగాయి. ఆ బస్తాలకు ఏకంగా రెక్కలొచ్చేశాయి. నిజానికి ఈసారి ధాన్యం అంచనాలకు మించి పండింది. అవసరానికి పదింతల ఉత్పత్తి సంభవించింది. అయినా బియ్యం రేట్లు హెచ్చాయంటే, కేంద్రం రాష్ట్రప్రభుత్వాల నడుమ సమన్వయలోపమే కారణమనాలి. భారత ఆహార సంస్థ ద్వారా సమీకరించింది. పలు రాష్ట్రాల అవసరాల మేర సరఫరా కావాలి. ఉత్పత్తుల్లో సగానికి పైగా విదేశాలకు తరలిపోతుంటే, జాతీయంగా ధరాఘాతం దాపురించదా మరి? రాష్ట్రాలపరంగా కొందరు వ్యాపారులు జట్టుకట్టి మరీ ధరలు పెంచేస్తున్నారు. బియ్యం రేటు భగ్గుమనడానికి ఇదీ ఒక కారణమే. గణాంకాల్లోకి ఇంకొంత తొంగిచూస్తే, ప్రపంచంలోనే బియ్యం వ్యాపారపరంగా మనదేశవాటా 40శాతానికి పైమాటే. ప్రత్యేకించి కొన్ని తరహాల బియ్యం ఎగుమతుల మీద నిషేధాలు విధిస్తే తప్ప, పరిస్థితి అదుపులోకి రాదు. అంతర్జాతీయంగా రెండు కీలకదేశాల మధ్య యుద్ధం అనంతరం పరిణామాలు ఈ దేశంలో ప్రభావాత్మకమయ్యాయి. రష్యా, ఉక్రెయిన్ పోరాటాన్నే ఉదాహరణంగా



తీసుకుందాం. భారత తటస్థవైఖరినే అనుసరించినా, స్పందనలు వేరుగా వ్యక్తమయ్యాయి. బియ్యం ఎగుమతిపైన నిషేధం పడింది. ఆంక్షలు గోధుమలు, పంచదారకూ విస్తరించింది. పర్యవసానంగా బియ్యం, ఇతర నిత్యావసరాల ధరలూ ఇక్కడ తగ్గినట్లే తగ్గి మళ్లీ పెచ్చుమీరాయి. పాల ఉత్పత్తుల పరిస్థితీ అంతే. వివిధ నిత్యావసరాలు తొమ్మిదేళ్ల వ్యవధిలో ఎంతగా ధర పుంజుకున్నాయో సరిపోల్చి చూద్దామిప్పుడు. బియ్యం కేజీరేటు రెట్టింపు అయింది.



గోధుమపిండి కూడా ఆ కోవలోనే. చక్కెర, ఆలుగడ్డ సరేసరి. చింతపండు ధర మూడింతల హెచ్చింపు. కందిపప్పు, మినపప్పు, శనగపప్పు ధరలు నింగినంటాయి.

**ఆరని అగ్నిజ్వాల**

ఇక 2014-2023 నడమన వంటగ్యాస ధరలు మంట పుట్టిస్తున్నాయి. ఎక్కడి రూ 400, ఎక్కడ రూ 1200? పెట్రోలు రేట రూ. 70 నుంచి రూ.110కి ఎగబాకింది. డీజిల్ నాడు రూ.55, నేడు రూ.97. ఆఖరికి టీపొడి ధర చూద్దామన్నా ఐదొందల గ్రాములు రూ.194, నుంచి ఇప్పుడు రూ.360. డజను అరటిపండ్లు రేటుపరంగా డబల్‌ను ఏనాడో దాటిపోయాయి. దేశంలో, విదేశాల్లో ఇదేవిధంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతూనే ఉండాలా? వీటిని నియంత్రించే చట్టాలంటూ ఉండవా? అంటే ఎందుకు లేవూ, చాలానే ఉన్నాయి. అమెరికాలోనైతే ఆయావస్తు ధరల గరిష్ఠతను అక్కడి ఆటలే పరిమితం చేస్తాయి. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ చట్టనిబంధనలు బలంగా ఉంటాయక్కడ. బ్రిటన్ చట్టాలు మార్కెట్ ఏకపక్ష ఆధిపత్యాన్ని అనుమతించవు. వంట ఇంధనాల ధరలకు సంబంధించి, యూరోపియన్ యూనియన్ దేశాల ప్రభుత్వాలు పూర్తిస్థాయి శ్రద్ధవహిస్తాయి. ప్రామాణికతకు మాత్రమే పెద్దపీట వేస్తుంటాయి. భారతదేశంలో మటుకు స్థితిగతులు పూర్తిగా వేరు! ఇంధనం ధరవరకు ఇక్కడ ఏళ్లతరబడి పెరుగుతూ వస్తున్నాయి.



ఇతర నిత్యావసరాల ధరలూ ఇక్కడ తగ్గినట్లే తగ్గి మళ్లీ హెచ్చుమీరాయి. పాల ఉత్పత్తుల పరిస్థితీ అంతే. వివిధ నిత్యావసరాలు తొమ్మిదేళ్ల వ్యవధిలో ఎంతగా ధర పుంజుకున్నాయో సరిపోల్చి చూద్దామిప్పుడు. బియ్యం కేజీ రేటు రెట్టింపు అయింది. గోధుమ పిండి కూడా ఆ కోవలోనే. చక్కెర, ఆలుగడ్డ సరేసరి. చింతపండు ధర మూడింతల హెచ్చింపు. కందిపప్పు, మినప్పప్పు, శనగపప్పు ధరలు నింగినంటాయి.

**ఆరని అగ్నిజ్వాల**


ఇక 2014-23 నడుమన వంట గ్యాస్ ధరలు మంట పుట్టిస్తున్నాయి. ఎక్కడి రూ.400/లు, ఎక్కడ రూ.1200/-? పెట్రోలు రేటు రూ.70/-ల నుంచి రూ.110/-కి ఎగబాకింది. డీజిల్ ధర నాడు రూ.55/-, నేడు రూ.97/-. ఆఖరికి టీపొడి ధర చూద్దామన్నా ఐదొందల గ్రాములు రూ.194/- నుండి రూ.360/- అయింది. అరటిపండ్ల రేటు ఏనాడో డబల్‌ను దాటిపోయాయి. దేశంలో, విదేశాల్లో ఇదే విధంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతూనే ఉండాలా? వీటిని నియంత్రించే చట్టాలంటూ ఉండవా? అంటే ఎందుకు లేవూ, చాలానే ఉన్నాయి. అమెరికాలోనయితే ఆయా వస్తు ధరల గరిష్ఠతను అక్కడి చట్టాలే పరిమితం చేస్తాయి. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ చట్ట నిబంధనలు బలంగా ఉంటాయక్కడ. బ్రిటన్ చట్టాలు మార్కెట్ ఏకపక్ష ఆధిపత్యాన్ని అనుమతించవు. వంట ఇంధనాల ధరలకు సంబంధించి, యూరోపియన్ యూనియన్ దేశాల ప్రభుత్వాలు పూర్తి స్థాయి శ్రద్ధ వహిస్తాయి. ప్రామాణికతకు మాత్రమే పెద్ద పీట వేస్తాయి. భారతదేశంలో మటుకు స్థితిగతులు పూర్తిగా వేరు!



ఇంధనం ధరవరలు ఇక్కడ ఏళ్ళ తరబడి పెరుగుతూ వస్తున్నాయి. పెట్రోలు, డీజిల్ రేట్లు విపరీతమవడానికి మూలం ముడిచమురు లభ్యతా స్థితి. అంతర్జాతీయంగా ఆ ధరలు పెచ్చుమీరడం. ఇది చాలదన్నట్లు దేశీయంగా కేంద్రం, రాష్ట్రాలు విధించి వసూలు చేసుకుంటున్న సుంకాలు తమ 'తమ వంతు' పాత్ర పోషిస్తు న్నాయి. ఇతరత్రా సరుకుల సరఫరా సంస్థలు రవాణా చార్జీలను ఇబ్బడి ముబ్బడి చేసేశాయి. వాటిని తమ దరికి చేర్చుకునేందుకు చిల్లర వ్యాపార సంస్థలవారు ఎక్కువగా చెల్లించాల్సి రావడం వేరొక కారణం. ఈ అన్నింటిలోనూ భారం ప్రథమంగా, ప్రధానంగా వాడకందారుల పైనే కేంద్రీకృతమైంది. నిత్యజీవనం నరకయాతనగా మారిపోయింది.

**చేతలు కావాలి మహాప్రభో!**

నిత్యావసర వస్తువుల ధరలు విపరీత పెరుగుదలను అరికట్టాలంటే ఏ ప్రభుత్వమైనా ఏం చేయాలి? దేశ వ్యాప్తంగా నెలకొన్న ద్రవ్యోల్బణ స్థితిగతులను నిశితంగా, సమగ్రంగా గ్రహించాలి. వస్తుసేవల ధరలకు కావాల్సింది స్థిరీకరణ. అంతేతప్ప వినియోగించేవారి నడ్డి విరిచే వ్యవహారం కాదు. పలు సమ్మిళిత కార్యకలాపాల నిర్వహణతోనే ప్రభుత్వాలు ఆశించిన ఫలితాలను సాధించగలవు. పప్పుధాన్యాలు, కూరగాయలు, నూనెగింజలు, అలాగే పండ్లు, పాల ఉత్పత్తుల పెరుగుదల, మెరుగుదల ప్రభుత్వాల బాధ్యతే. పంట ఉత్పత్తులకు విపణి సదుపాయాలు, ముందుగా నిల్వ సౌకర్యాల శీతల గిడ్డంగులు తక్షణ అవసరాలు. జాతీయ స్థాయిన వ్యవసాయ సహకార మార్కెటింగ్ ఫెడరేషన్ ఉండనే ఉంది. సహకార పరంగా వినియోగదారుల సమాఖ్య పని చేస్తోంది. వీటి సంస్థాగత పనితీరు ఎంత మెరుగుపడితే అంత ఉత్తమం. కొన్ని నిత్యావసరాల విక్రయ విధులను అవే చేపట్టాల్సి ఉంటుంది.



ముఖ్యమైన వస్తు ఎగుమతుల, దిగుమతుల విధానాలను పాలకులే ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ సమీక్షించడం అత్యవసరం. నియంత్రణ రీతులను కాలానుగుణంగా సమీక్షించుకోవాల్సిందే! ప్రజా పంపిణీ వ్యవస్థకి జవజీవాలను తిరిగి సమకూరిస్తేనే అధిక ధరల నియంత్రణ సుసాధ్యమవుతుంది. ఆహార భద్రతకు ఆ వ్యవస్థే జవాబుదారీ. పంపిణీ సవ్యంగా, సకాలంలో కొనసాగేలా ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటైంది. బియ్యంతో పాటు గోధుమలు, చక్కెర, కిరోసిన్ వంటి వాటిని అందించాల్సి ఉంటుంది. ఆహార ధాన్యాల సరఫరా బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదే. ఆయా ధాన్యాల సేకరణ, నిల్వ, రవాణా, భారీ ఎత్తున కేటాయింపుల విధి కేంద్రానిది. చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ రాష్ట్రాల కర్తవ్యం. ఇదే సందర్భంలో ధరల స్థిరీకరణ నిధిని ప్రస్తావించి తీరాలి. దీని మూలాన సబ్సిడీ రేట్లకు కూరగాయలు అందజేత సులువవుతుంది. మరి రోజు రోజుకీ హెచ్చుతున్న డీజిలు, పెట్రోలు ధరలు సామాన్యులను మరిన్ని ఇబ్బందులపాలు చేస్తున్నాయి. ఇదే వైఖరి కొనసాగుతుంటే ఇంకెన్నో విపరిణామాలు చోటు చేసుకుంటాయి. కాలక్రమంలో అశాంతిని పెంచి ఆందోళనలకీ దారి తీస్తాయి. ఈ వాస్తవాన్ని పాలనా వ్యవస్థలు ఎంత త్వరగా గుర్తిస్తే ప్రజానీకానికి అంత మంచిది.

**విధి విధానాలే మిన్న..**

నిత్యావసరాల్లో ఔషధాలు జత చేరాయి. వాటికీ ధరల వాపు అనేక విధాలుగా బాధాకరం. ఈజిప్టులో మందుల ధరల అదుపునకు విలక్షణ వ్యవస్థ ఏర్పాటైంది. మరో దేశం కెనడా ఆ ధరల తీరుతెన్నులను సమీక్షిస్తుంటుంది. ఇక్కడైతే పౌర ఆరోగ్య పరిరక్షణ రీతి గందరగోళం.. చిందరమేళం. ఆరోగ్యాన్ని పదిలపరచుకో వాలంటే- సగటు మనిషి తన పాట్లు తాను పడాల్సిందే. ధరల నిర్ణాయక



వ్యవస్థ ఉన్నప్పటికీ, ఫలితం కొంత మాత్రమే. దరిదాపు అర్ధ శతాబ్దినాటి కమిటీ నివేదికల్ని ఈ సమయంలోనే ప్రస్తావించుకుందాం మనమంతా.



అప్పట్లోనే సంఘం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఔషధ విధానం వెలువడింది. ప్రత్యేక మందుల ధరలను క్రమబద్ధీకరించే సంస్థ తనదైన తీరున వ్యవహరిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల అనుభవాన్ని సరిపోలిస్తే, పొరుగు రాష్ట్రం తమిళనాడు నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉందనే అనాలి. మందుల గురించి కేంద్రీకృత సమీకరణ విధానమే సరి. కొనుగోలు సమయాల్లో విధి విధానాల అనుసరత తూ.చ. తప్పక జరగాలి. మందులు లేక, వైద్యం అందక సగటు జీవి తల్లడిల్లడం ఎంత వ్యథాభరితం?

పేదలు, మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి ప్రభుత్వాలు చేసింది కొంత, చేయాల్సింది మరింత. సగటు కుటుంబ ఖర్చు తెగ పెరిగిపోవడాన్ని సమర్థంగా అరికట్టాలి. వినియోగదారుల ధరల సూచీ దేశ వాస్తవికతను వెల్లడిస్తోంది. ప్రామాణికత అవసరాన్ని వేనోళ్ల చాటిచెప్తోంది. ధరల పోటు బారిన పడకుండా సామాన్య పౌరులను పరిరక్షించాల్సింది ప్రభుత్వాలే. మునుపు రెండు దేశాల(రష్యా, ఉక్రెయిన్) పోరు వల్ల వస్తు సరఫరాలు స్తంభించినందునే ముడిచమురు సహా వంటనూనెల ధరలు ఇక్కడ పెరిగాయి.

వంటగ్యాస్ ధరలూ పెరిగి రవాణ మొత్తాలను తడిసి మోపెడు చేశాయి. రూపాయి పతనరీతి సైతం ధరల పెరుగుదల మంటలకు ఆజ్యం పోస్తోంది. ఈ విపత్కర వాతావరణాన్ని యథాపూర్వ స్థితికి తెచ్చి ప్రజల్ని ఆదుకునేలా ఆటు కేంద్రం, ఇటు రాష్ట్రాల క్రియాశీలత కనబరచాల్సిందే. ధరల పర్యవేక్షణ కేంద్రాల ఏర్పాటు ఒక్కటే శాశ్వత పరిష్కారం కాదని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు రెండూ తెలుసుకొని మసలాలి. నిత్యావసర వస్తు ధరల నియంత్రణలో చేయగలిగినంతా చేస్తే తప్ప ఇంటా బయటా ప్రశాంతత చేకూరదు. పౌర సరఫరా శాఖలను బలోపేతం చేయడం కూడా ఉభయ రాష్ట్రాల తక్షణ కర్తవ్యం. హామీలు ఆచరణకొస్తే, అవి స్థిరంగా నిలిస్తే ప్రభుత్వాలకు మర్యాద, మన్నన. అప్పుడు నిరసనవాదులు కాదు, జయ జయ ధ్వానాలు వినిపిస్తాయి. ఇదే నిత్య సత్యం. ■



# పసందైన పచ్చళ్లు




## అరటిపువ్వు పచ్చడి

**కావలసినవి**

శుభ్రం చేసుకుని తరిగిన అరటిపువ్వు తరుగు, ఎండుమిరపకాయలు-6,
చితపండు-నిమ్మకాయంత, బెల్లం తరుగు- రెండు స్పూన్లు, నూనె-నాలుగు స్పూన్లు, పోపుదినుసులు అన్నీ-తగినన్ని,
ఉప్పు-తగినంత

**తయారీ విధానం**

ముందుగా స్టౌ వెలిగించి కళాయి పెట్టి కొద్దిగా నూనె వేసి, అరటిపువ్వు తరుగుని, పసుపు, ఉప్పు వేసి మెత్తగా మగ్గనివ్వాలి. ఆ తర్వాత కళాయిలో కాస్త నూనె పోసి పోపు సామగ్రి వేయించుకుని చివరగా ఎండుమిరపకాయ ముక్కలు కూడా వేయించుకుని స్టౌకట్టేయాలి. పోపు చల్లారాక కాసిన పోపు గింజలు ఉంచి మిగతా పోపుతో చింతపండు కూడా మిక్సీలో గ్రైండ్ చేసుకోవాలి. ఆ తర్వాత మగ్గిన అరటిపువ్వు తరుగుని మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఆ తర్వాత బెల్లం తరుగు ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి. ముద్దలా దగ్గరికి వచ్చాక గిన్నెలోకి తీసుకుని మిగిలిన పోపు గింజలు కలుపుకోవాలి.



## కంద పచ్చడి

**కావలసినవి**

చెక్కు తీసి చిన్నగా తరిగిన కందముక్కలు రెండుకప్పులు, పసుపు -ఒక టీస్పూన్, ఉప్పు-తగినంత, నూనె- ఆరు స్పూన్లు, పోపు దినుసులు- తగినంత, ఎండుమిరప కాయలు-5,
కొత్తిమీర తరుగు, ఉసిరికాయంత చింతపండు, ఇంగువ ఒక స్పూను



**తయారీ విధానం**

ముందుగా కందముక్కలను నూనెలో వేయించుకోవాలి. ఆ వేగిన ముక్కలను తీసి, ఒక ప్లేటులో పెట్టి అదే కళాయిలో మరింత నూనె వేసి పోపు వేయించుకోవాలి. ఆ తర్వాత స్టౌ కట్టేసి కాసిన పోపుగింజలు ఉంచుకుని మిగతా పోపు, చింతపండుగుజ్జు, పచ్చిమిరప కాయలు వేసి, గ్రౌండ్ చేసాక, వేగిన కంద ముక్కలు కూడా వేసి, మిక్సీలో గ్రైండ్ చేసి, ఒక గిన్నెలోకి ఆ పచ్చడి తీసుకుని మిగిలిన పోపుగింజలను, కొత్తిమీర తరుగును, ఆ పచ్చడిలో కలుపుకోవాలి. ఇష్టమైనవారు కాస్త బెల్లం వేసుకోవచ్చు.

## దూట పెరుగు పచ్చడి



**కావలసినవి**

పీచు లేకుండా సన్నగా తరిగిన దూట తరుగు ఒక కప్పు, పచ్చిమిరపకాయలు-2, కొత్తిమీర తరుగు-నాలుగు స్పూన్లు, గట్టి పెరుగు-ఒక కప్పు, పోపు-తగినన్ని, నూనె-నాలుగు స్పూన్లు, ఉప్పు-తగినంత



**తయారీ విధానం**

ముందుగా స్టౌ వెలిగించి కళాయి పెట్టి కొద్దిగా నూనె వేసి దూట తరుగుని, ఉప్పు వేసి మెత్తగా మగ్గనివ్వాలి. చల్లారాక పెరుగులో వేసి కలపాలి. ఆ తర్వాత కళాయిలో మరి కాస్త నూనె పోసి పోపు సామగ్రి వేయించుకుని, చివరగా ఎండు మిరపకాయ ముక్కలు కూడా వేగాక కొత్తిమీర తరుగు, పచ్చిమిర్చి సన్నని చక్రాలుగా తరిగి వేయాలి. బాగా కలిసేలా కలపాలి. ఇదేవిధంగా తోటకూర, పొట్లకాయ, టమాటా, క్యాబేజీ, క్యారట్, కొబ్బరి, వంకాయ, పెరుగు పచ్చళ్లు చేసుకోవచ్చు.

**- చెంగల్వల కామేశ్వరి**

# తెలుగుతల్లికి 'శంకరంబాడి' మల్లెపూదండ

**తెలుగు రాష్ట్రాల గీతమైన 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' రచయిత శంకరంబాడి సుందరాచారికి అత్యంతప్రీతి పాత్రమైన కవితా ప్రక్రియ పద్యకవిత్వం. తేటగీతిలో పద్నాలుగేళ్లకే ఛందోబద్ధ కవితా రచనలో సరళమైన, మదుపదాలతో, సుందరాచారి అనన్య విశిష్టమైన రచనలతో, తేటగీతుల తెలుగు తీపిరుచుల సాహిత్య సృష్టికర్తగా ప్రశంసలు పొందారు.**




సుందరాచారి 1914 ఆగస్టు 10న తిరుపతిలో జన్మించారు. చిన్నతనం నుంచి స్వతంత్రభావాలతో అమితమైన ఆత్మవిశ్వాసంతో ఎవరికీ తలవంచకుండా స్వేచ్ఛగా జీవించారు. తెలుగుజాతి చారిత్రక, సాంస్కృతిక వారసత్వ మహోన్నతను 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ'లో చాటిచెప్పి, ఆ గీతాన్ని 1942లో 'దీనబంధు' సినిమాకు పదవపాటగా రచించారు. కాని చిత్రనిర్మాత హెచ్.ఎం.రెడ్డి అత్యంత విలువలున్న ఆ అద్భుతభావగీతికను సినిమా పాటగా ఉయోగించటానికి ఇష్టపడలేదు. టంగుటూరిసూర్యకుమారి, హెచ్.ఎం.వి కంపెనీవారి గ్రామఫోన్ రికార్డుగా పాడితే, యావత్ తెలుగు ప్రపంచంలో ఆ పాట మారుమోగింది. శ్రోత్రియవైష్ణవ కుటుంబంలో జన్మించిన సుందరాచారి, సుందర రామాయణం, సుందరభారతం, శ్రీనివాసశతకం, జపమాల, బుద్ధగీతి, గీతాంజలి అనువాదం, ఏకలవ్యుడు ఖండకావ్యం, కెరటాలు, సుధాబిందువులు, భావగీతాలు, జానపదగీతాలు, స్థలపురాణాలు, అపవాదు, పేదకవి, నాస్వామి, నేటికవిత్వం, బలిదానం, కార్వేటి నగర నీరాజనం ఎన్నో రచనలు సృష్టించారు. 'మహాత్మాగాంధీ', 'బిల్హణీయం', 'దీనబంధు'వంటి సినిమాలకు పాటలు రచించారు. సంభాషణలు కూడా రాసారు. నటించారు. తెలుగుసాహిత్యంలో తేటతెనుగుతనాన్ని పుణికిపుచ్చుకుని భావకవిగా, సుందరకవిగా మాతృభాషకు సజీవ మాధుర్యాన్ని అందించిన సుందరాచారిని, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం 'ప్రసన్నకవి' బిరుదుతో సత్కరించింది. స్వేచ్ఛాజీవి సుందరాచారి జీవితంలో ఎన్నో వింతలు, విశేషాలు, సాహసిక సంఘటనలు చోటు చేసుకున్నాయి. జీవితం పొడవునా దురదృష్టం వెంటాడింది. మద్రాస్ సినీరంగంలో మద్యం వ్యసనమైంది. 'శంకరంబాడి' తనకు తాను ఇచ్చుకొన్న బిరుదు 'మధుపాన మత్తమహాకవి' బ్రతుకుని తృణప్రాయంగా తోసిరాజని స్వేచ్ఛాజీవన సంచారం సాగించిన సర్వస్వతంత్రుడు. తిండితిప్పలు చూసుకోవడానికి రైల్వేస్టేషన్‌లో, హోటళ్లలో కాయకష్టం చేసారు. బడిపిల్లల కోసం ఉపాధ్యాయునిగా కవిత్వం రాసారు. సామాన్యులను నమ్ముకొని అణాకి, రెండణాలకి తన పుస్తకాలు అమ్ముకొని జీవనం సాగించారు. తన పద్యాలను ఆనందభైరవి, కేదారం వంటి రాగాలతో పాడేవారు. గంభీరంగా హాస్యోక్తులతో ఆయన ఉపన్యాసాలు ఆకట్టుకొనేవి. అప్పటి లోక్‌సభ స్పీకర్ అనంతశయనం అయ్యంగార్‌కు ఆయన స్వయానా మేనల్లుడు. తన బుద్ధగీతను ఆంగ్లంలో జవహర్‌లాల్ నెహ్రూకి వినిపించారు. కార్వేటిరాజా, మండలి వెంకట కృష్ణారావు వంటి ప్రముఖులకు ఎందరికో సన్నిహితుడైనా, ఎవ్వరి పరిచయాలను, సాంగత్యాన్ని తన జీవికకోసం వాడుకోలేదు. స్వాతంత్ర్యానంతరం, మద్రాస్ రాష్ట్రంలో అంతర్భాగంగా వున్న తెలుగునాట ప్రతిభావంతులైన రచయితలు, కవులు, జాతి నిర్మాతలైన సమరయోధులు కూడా తమ జీవిక కోసం ఎన్నో కష్టాలు పడవలసి వచ్చింది. అజ్ఞాతంగా ఎందరో కనుమరుగయ్యారు. మద్రాస్ సినీ రంగాన్ని, పత్రికారంగాన్ని ఆశ్రయించుకొని దుర్భర అవస్థలు అనుభవించిన వారున్నారు. పట్టుజుబ్బాలు, ధోవతులతో తిరిగే ప్రసన్నకవి, స్వేచ్ఛాజీవి శంకరంబాడి సుందరాచారి చివరిదశలో కోరాగుడ్డ, జుబ్బాలు, చౌకబారు నాలుగుమూరల పంచెతో జీవించవలసి వచ్చింది. 1977 ఏప్రిల్ 8న తనువుచాలించారు.

సుందరాచారి ఆశువుగా చెప్తూవుంటే మిత్రుడు వై.కె.వి.ఎన్.ఆచార్య అంతవేగంగా వాటిని అక్షరబద్ధం చేసేవారు. భాగవతం దశమస్కందం ఆధారంగా 'సుందరనందనం' పేరిట 600 పద్యాలు రాసారు. 'ఆ మహానుభావుడు పోతన మహాకవి గొప్ప భక్తుడు. ఆయన జీవితం స్ఫటికంలా స్వచ్ఛమైనది. అలాంటి భక్తుడు, తపస్వి కావ్యం రాస్తే దానికొక విలువ వుంటుంది. నాబోటి అల్పులు, పిచ్చికుక్కలు రాయడం ఏమిటి' అంటూ 600 పద్యాల కాగితాన్ని చింపేసాడు సుందరాచారి. అదీ ఆ మనిషీ సుందర, స్వచ్ఛ జీవనవ్యక్తిత్వం.

'ఈ లోకమున నను ఏల సృష్టించితివి?
సృష్టించి ఏ పనిని
చేయనియమించితివి?
చిన్నబుచ్చకనాకు చెప్పరావా దొర!
ఈ చిన్నగుండెలో ఎన్ని గుండ్రాలురా!
ఈ లేతబుర్రలో ఎన్ని కంపాలురా!
వద్దురా ఈ బ్రతుకు వద్దురా దేవుడా!'

ఇప్పుడూ, అప్పుడూ చాలామంది కవులు, రచయితలు అడిగే ప్రశ్న నాడే 'శంకరంబాడీ', దేవున్ని అడిగారు.

**- జయసూర్య**

# నిరీక్షణలో..!



**చెలీ!**
నీ నిరీక్షణలో/ ఆ విరహాణలో
నా కోసం వీక్షణలో
నీ గుండెల్లో ఎగిసే ఆరాటం
అనుక్షణం వెంటాడే అనురాగం
సంద్రంలో సన్నగా ఎగిరిపడే
అలల సవ్వడిలా / ఆ పరవశపు అలజడి
నీ కనురెప్పలపై నుండి
మెల్లగా కంటిపాపలోకి జారి
ఇది వాస్తవమని చెబుతోంది
ఆ క్షణాన..
నీ మోమున పూసిన
పులకింతల పువ్వులు
ఆకాశ మార్గాన విహరిస్తున్న
నీ ఊహాలు/ నీవు పడిన కమ్మని అగచాట్లు
తియ్యటి తడబడే పలుకులు/ చూశాకనే
తెలిసింది/ నీ తపనంతా నా రాక కొరకేనని
నా 'ప్రేమ'కోసమేనని..

**- నాగమునిఎం.**

---

# వేదిక నీదే..


**నువ్వు** ఎలా ఉండాలో
నిర్దేశిస్తూ నాలుగు వైపులా గీతలు
దాటి వెళితే వెలి వేసి అగ్నిపరీక్ష శిక్షగా
నవ్వడానికి పరిధులు వున్నాయి
పరి పరి విధాల అర్థాలు రాసాం
హద్దు మీరితే యుద్ధమే సుమీ
ఎంతవరకు మాట్లాడాలో
ఎప్పుడెప్పుడు ఊ కొట్టాలో
స్క్రిప్టు ప్రకారమే జరగాలి అంతా.
బట్ట పొడవెంత వుండాలో
బతుకంతా కొలతలు నిర్దేశించాం
స్వేచ్ఛ అంటే సోషల్ మీడియాలో
వైరల్ చేస్తాం./ నీ హోదాకు అసూయ
ఎంతో/ వెనకా ముందూ గుస గుసలు
ఓటమి కోసం చీకటి యాగాలు చేస్తారు
ముళ్లని గీతల్ని చెరిపేసి
కొలతలకందని విజయ శిఖరాన్ని చేరు
వేదిక నీదే.. ఇక
వేయి మంది ఏడ్చిపోదురుగాక.

**- దాసరి మోహాన్**



## ఈవారం కవిత్వం


# ఎవరో?



మనసెంత మౌనంగున్నా
వయసు పరుగునాపేదెవరు
మనిషెంత గంభీరంగున్నా
తీరని ఆశలనాపేదెవరు
మార్గమేదో కనబడుతున్నా
కమ్మిన నిశిని వెలుగై
తరిమేదెవరు
అక్కడక్కడ
అడ్డంకులెదురై
తరుముతుంటే
స్ఫూర్తినందిస్తూ
ఆలంబనగా
నిలిచేదెవరో
జీవన సమరంలో
స్వేదమెంత చిందించినా
విజయబావుటా శిఖరంపై
రెపరెపలాడించేదెవరో!

**- సి.శేఖర్(సియస్సార్)**

## పుస్తక సమీక్ష



## సుధీర్ 'మనసు పలికిన' కథాసంపుటి

తన సీరియల్స్ వందలాది ఎపిసోడ్‌లు, రియాల్టీషోలు, సమాజంపై చూపిస్తున్న ప్రభావాన్ని జాలాది రత్నసుధీర్, తన 'మనసు పలికిన' కథాసంపుటిలో తొలికథ 'స్వర్గానికి వెయ్యోవ్యక్తి'లో విశిత దృష్టితో పరిశీలించారు. సంపుటిలోని 15 కథలలో వాస్తవికతకు తగిన స్థాయిలో కల్పనా చమత్కృతిలో రచయిత సామాజిక అభ్యుదయాన్ని ఆకాంక్షించారు. అవినీతికి పరిష్కారం సమాజం వద్దే వుంది. అవినీతిని సమాజం ఎలా ప్రోత్సహిస్తోంది. 'రాజుగారి ఏడు చేపలకథ' ప్రస్తుత సమాజనైజాన్ని విమర్శించి వాతపెడ్తుంది. స్వచ్ఛమైన స్నేహం పదిలమైన బంధాలే జీవితానికి ఆనందాన్ని, ఆరోగ్యాన్ని, ఆయుష్షు అందిస్తాయని క్షమ, ప్రేమ, స్నేహం ఆదర్శనీయతతో 'వందన వివాహవార్షికోత్సవం' సందేశం అందిస్తుంది. వ్యవస్థలో, వ్యక్తులతో అవినీతి ఇతివృత్తంగా అవినీతి మూలాలు, కారణాలను ఆలోచింపచేసేవిధంగా కథాకథనాన్ని రత్నసుధీర్ తీర్చిదిద్దారు. 'డబ్బుంటే ఏమైనా కొనుక్కోవచ్చు. ప్రేమతప్ప'. తల్లిదండ్రులు, మనోభావాలు, పిల్లల పట్ల చూపించవలసిన ప్రేమ చూపించలేని పరిస్థితిని 'ఏంకొనుక్కుంటావు' కథ సూచిస్తోంది. ఉత్తమభావాలు, సూర్పివంతమైన ఆదర్శం, మంచితనం, సామాజిక ప్రయోజనాన్ని ఆకాంక్షించే కథలు ఆసక్తిగా చదివింప చేస్తున్నాయి.

**(మనసు పలికిన.., రచన: జాలాది రత్నసుధీర్, వెల: రూ 100, ప్రతులకు: 501, సాయికృష్ణ టవర్స్, 8-2-229/16/డబ్ల్యూ, హైలెమ్‌కాలనీ, వెంకటగిరి, హైదరాబాద్)**

**- యర్రమిల్లి**




## మనిషంత అందంగా చెప్పిన కవిత్వం

ప్రముఖ ఉర్దూ కవి సాహెబ్ ప్రేరణతో, మనిషిని ప్రేమించడం నేర్పిన మహాకవి శివారెడ్డి సాహచర్యంతో.. మూడుదశాబ్దాల కవన ప్రస్థానంలో హైదరాబాదీ కవి ఆశారాజు 21 కవితాసంపుటాలు వెలువరించాడు. మనిషి అన్వేషణలో..మనిషితనం ఆచూకి కొరకు కవిత్వమై 107 పాయలుగా ప్రవహిస్తున్నాడు.'ఇప్పుడు ఒక మనిషి కావాలి/ ఎవరైనా కానీ..ఒక మనిషి కావాలి/ నాకు ఎదురు పడటం లేదు కానీ/ మనిషి ఎక్కడో వుండే వుంటాడు/ ఇక్కడ అందరూ నాలాగే/ మనిషిని వెతుకుతున్నవాళ్లే' మనిషంటే ఎవరు? జీవితమే! మనిషంటే ఎవరు? కవిత్వమే! 'నీవు కలిసినప్పుడల్లా/ నన్ను గుర్తు పట్టలేదంటావ్/ ఎన్ని జ్ఞాపకాలు గుర్తుచేసినా/ ఏదీ గుర్తుకు రాలేదంటావ్/ ఓ జీవితమా!/ ఎప్పుడు కలిసినా..ఇదే తప్పించుకునిపోతావ్' కవిత్వం రాయడం తప్ప మరో ధ్యాసలేని ఆశారాజుకి మనుషులను ప్రేమించడం తప్ప ఇంకో విద్య తెలియదు. ఆయనను దగ్గరగా గమనిస్తే ఈ విషయం అవగతమవుతుంది. ఎదురుగా పలకరించే మనిషి కోసం పలవరించే ఈ కవి 'నన్ను నేను దగ్గరగా చూశాను' అంటున్నాడు. కళ్లనిండా జీవితాన్ని శ్వాసించానని వాపోతున్నాడు. 'ఓనామిత్రమా! ఎప్పుడైనా, ఎక్కడైనా మనిద్దరం ఎదురుపడితే/ నన్ను గుర్తు పట్టనట్టు/ నటించకు సుమా!' అని అర్థిస్తున్న ఆశారాజుకి..180 పుటల్లో మనిషిని ఎక్కడైనా వెదికిపెట్టండి..ప్లీజ్ గొప్ప కవిత్వం ఎలా వుంటుందో ఒక్కసారి పరికించండి.

**(నన్ను నేను దగ్గరగా చూశాను, రచన: ఆశారాజు, వెల: రూ 200, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్ హైదరాబాద్)** **- రమణ వెలమకన్ని**

## టాగూర్ కథాకథనం 'శిలావిలాపం'



ఈదేశానికి తొలిగా నోబెల్ బహుమతి అందించిన అగ్రశ్రేణి భారతీయ కవి, రచయిత రవీంద్రనాథ్ టాగూర్. ఆయన 1891 నుండి 1917 వరకు 119 కథల్లో కొన్నింటిని సుదర్శన్ తెలుగు కథలే అన్నట్లుగా చక్కగా అనువదించి అందించారు. 20 కథలూ అద్భుతమైన ఎంతో ప్రామాణికత గల కథలే..పోస్టుమాస్టర్, శిలావిలాసం, నగలపెట్టె, అపరిచిత-శిక్ష, కాబూలీవాలా పొదుపుకథ, పరిత్యాగం లాంటివి మళ్లీమళ్లీ చదవాలి అనిపిస్తాయి. 'విశ్వాసపాత్రుడు' కథలో తండ్రి, కొడుకు, మనవడు, పాత్రలతో కథ నడుస్తుంది. తండ్రి జగన్నాథ్‌తో, అతని కొడుకు బృందావన్ విభేదించి ఇల్లు వదిలి తన కొడుకు గోకుల్‌తో వెళ్లిపోతాడు. ఒక రోజు నితామ్ జగన్నాథ్‌ను కలవడం అతని ఆస్తిని గుళ్లోనేల మాళిగను దాచిన ధనం నితామ్‌ని చూసి అతన్ని అక్కడే వుంచుతాడు. అతని తండ్రి దామోదర్ వచ్చి తన తండ్రి జగన్నాధాన్ని కొడుకు సంగతి చెప్పి గోకుల్‌ని నితామ్‌గా పేరు మార్చానని చెపుతారు. 'పోస్టు మాస్టర్' కథలో రెండే పాత్రలు. పోస్టుమాస్టర్ అతని సహాయకురాలు రత్న అనే పిల్ల..ఒంటరితనం తన ఇల్లు, తల్లి, చెల్లి గుర్తు వచ్చి బదిలీ చేసుకోవడానికి ధరఖాస్తు పెట్టుకోవడం జాబురాక పోవడంతో రాజీనామా చేసి వెళ్లిపోతాడు పోస్టుమాస్టర్. ఇద్దరి మనస్సుల్లో జరిగే మానసిక తాత్త్విక సంఘర్షణే ఈ కథ ముగింపు. **(టాగూర్ కథలు, అనువాదం: చింతపట్ల సుదర్శన్, వెల: రూ 150, ప్రతులకు: 1-5- 168, న్యూమారుతినగర్, హైదరాబాద్)** **- తంగిరాల చక్రవర్తి**

## బోనాల పండగ పుట్టుపూర్వోత్తరాలు



తెలంగాణలో, ప్రత్యేకించి జంటనగరాల్లో ఆషాడమాసంలో, శక్తిదేవతకు ప్రతిరూపమైన మహంకాళి దేవతకు బోనాలు సమర్పించుకుంటారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం బోనాలు, బతుకమ్మపండుగలకు ప్రాధాన్య త కల్పించి 'రాష్ట్రపండుగలు'గా నిర్ణయించింది. తెలంగాణ సంస్కృతిలో భాగమైన బోనాల పండుగ విశిష్టతను తెలి పేందుకు తెలంగాణ ప్రభుత్వభాషాసాంస్కృతికశాఖ వారు మామిడి హరికృష్ణ సంపాదకత్వంలో 'తెలంగాణ బోనాలు' అనే ఈ చిరు గ్రంధాన్ని వెలువరించారు. ప్రొ॥ననుమాస స్వామి పలు తెలుగు, ఇంగ్లీషు గ్రంధాలు బుక్‌లెట్స్ కరపత్రాలు, ఖ్యాతియుతులేకాకుండా పలు దేవాలయాలకు క్షేత్ర పర్యటనగావించి, జన శృతములైన వివరాలు సేకరించి రూపొందించారు. 8 అధ్యాయాలు, పలు ఉప-అధ్యాయాలలో స్వామి ఆర్య ద్రవిడ సాంప్రదాయాలు మొదలు కుని, బోనానికి సమకూర్చుకోవలసిన పూజాద్రవ్యాలు రాజ ధాని బోనాలలో పలు ప్రాంతాలు పాటించే విధివిధానాలు, గొల్కొండ (హైదరాబాద్), ఉజ్జయిని మహంకాళి (సికింద్రాబాద్) దేవాలయాల చరిత్ర వంటివి వివరంగా ఇచ్చారు. అందరికీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో పుస్తకం ధర రూ100 నిర్ణయించిన భాషాసాంస్కృతిక వారు అభినందనీయులు.

**(తెలంగాణ బోనాలు, రచన: ప్రొ॥ననుమాస స్వామి, సంపాదకులు: మామిడిహరికృష్ణ, వెల: రూ 100, ప్రతులకు: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, హైదరాబాద్)** **- కూర చిదంబరం**





# జాతీయ పతాకాన్ని గౌరవిద్దాం

**శ్రావణమాసం** రాగానే మహిళలంద రిలో భక్తిపారవశ్యం పెరిగినట్లు ఆగస్టు నెలరాగానే దేశ ప్రజలందరికీ జాతీయత, దేశభక్తి పరవళ్లు తొక్కుతుంది. ఈ నెలరోజులు ఎటుచూసినా మువ్వన్నెల కళకళలే. ఆగస్టు 15, స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రైవేట్ కార్యాలయాలలో, స్కూల్స్‌లో, ప్రతిసామూహిక నివాసాలలో ఇంకా బస్తీలలో పతాకావిష్కరణతో పాటు అనే సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల పోటీలు నిర్వహించి పిల్లలకు, పెద్దలకు బహుమతులు ప్రదానం చేసి, వచ్చిన ముఖ్యఅతిథుల చేత నాలుగు సూక్తులు, దేశభక్తి ప్రబోధనలు చెప్పించడం పరిపాటి. కాకపోతే స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో దేశభక్తి, జాతీయత కొన్ని నిబంధనలకు, నియమాలకు లోబడి ఉండేవి. పతాకోత్సవం ప్రమాణాలకు లోబడి జరుపుకునేవారు. స్వాతంత్ర్యం దినోత్సవం, గణతంత్ర దినోత్సవం పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా, దేశ ప్రజలందరు ఏకత్వంలో కులమత రాజకీయాలకు అతీతంగా ఆత్మీయంగా జరుపుకో వాల్సిన కొన్ని సెక్యులర్ జాతీయ పండుగలు. అవగాహన లేక కొన్ని అపార్టుమెంట్లలో, ఇతర ప్రదేశాల్లో మహాత్మాగాంధీ, ఇతర దేశనాయకుల ఫొటోలు పెట్టి, జెండా ఎగురవేసి, ఆ నాయకుల ఫొటోలకు పూజచేసి, కొబ్బరికాయకొట్టి, హారతి ఇస్తుంటారు. ఇదేం సంప్రదాయం?

స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచిన మనలో ఎంతమందికి సరైన అవగాహన ఉంది? ఎంతమంది జెండావందన నిబంధనలకు లోబడి జరుపుకుంటున్నారు. రాజకీయాలకు అతీతంగా జరుపుకోవలసిన విశిష్ట కార్యక్రమం నేడు ఢిల్లీ నుండి గల్లీ వరకు రాజకీయ పార్టీల ప్రాముఖ్యత, నాయకుల పరపతి చాటుకునే ఒక అవకాశంగా మారిపోయింది. చాలా రాష్ట్రాలలో ముఖ్యమంత్రికి, గవర్నర్లకు సరైన అవగాహన, సయోధ్య ఉండదు. రాజ్యాంగం ప్రకారం ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నాడు రాష్ట్రముఖ్యమంత్రి, జనవరి 26 గణతంత్ర దినోత్సవం నాడు గవర్నర్ పతాకావిష్కరణ చేసి గౌరవ వందనం స్వీకరించాలి. గత సంవత్సరం 75 సంవత్స రాల డైమండ్ జుబ్లీ మహోత్సవాలు జరిగాయి. అంతటా చాలామంది జాతీయజెండాలను ఎగురవేసారు. తర్వాత వాటిని తీసి, వాటిని భద్రపరచుకోవాలి. కానీ సాధారణ గృహాలు, అపార్ట్‌మెంట్లలో జెండాలను చాలాచోట్ల అలాగే వదిలేశారు. దీంతో గాలికి ఆ జెండాలు తలకిందులుగా మారిపోయి, ఎండకు ఎండి, గాలికి చిరిగిపోతున్నా పట్టించుకోవడం లేదు. జాతీయజెండాకు ఇచ్చే గౌరవం ఇదేనా! ఈసారి ఆవిధంగా జరగకుండా జాగ్రత్తపడాలని ఓ చిన్న విన్నపం.

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 1990 దశకం వరకు జాతీయజెండాను సామాన్యప్రజలు తమ నివాసాలలో ఎగురవేయుట నేరం. ప్రభుత్వ కార్యాలయాల్లోను, ప్రైవేటు కార్యాలయాలు, స్కూల్స్, ఇంకా సామాజిక సంస్థలు మాత్రమే జెండా ఎగురవేయుట జరిగేది. 1992లో జిందాల్ సంస్థ యజమాని నవీన్ జిందాల్ జాతీయ పతాకం ఎగురవేయుట ప్రతి భారతీయుని హక్కు అని, సామాన్య ప్రజలు తమ నివాసాలలో ఎగురవేసేందుకు అనుమతి ఇవ్వాలని న్యాయపోరాటం చేశారు.



1919 సుప్రీంకోర్టు, జెండా ఎగురవేయుట అనే హక్కు రాజ్యాంగంలోని ప్రాథమికు హక్కు అని ఆర్టికల్ 19 ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ పరిధిలోకి వస్తుందని, జాతీయ ఫ్లాగ్ కోడ్ కేవలం ఎగ్జిక్యూటివ్ ఇన్‌స్ట్రక్షన్స్ మాత్రమే అని, చట్టం కాదు అని వివరిస్తూ నేషనల్ ఫ్లాగ్ కోడ్‌ని సవరించమని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2002లో కొత్త నియమనిబంధనలతో ఫ్లాగ్‌కోడ్‌ని సవరించింది. అప్పటి నుండి సామాన్యపౌరులకు తమ నివాసాలలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే హక్కు లభించింది. కానీ ఆ హక్కు ఫ్లాగ్ కోడ్‌లోని నియమనిబంధనలకు లోబడి ఉండాలి.

- జాతీయ పతాకాన్ని ఉద్దేశపూర్వకంగా నేలపై పడవేసికాని, చింపడం వంటి దుశ్చర్యల వల్లగాని, నీటిలో పారవేసిగాని అగౌరపరచకూడదు.
- జాతీయ జెండాను ఎప్పుడు ఎత్తైన స్థలంలోనే ఎగురవేయాలి. భవనాలపైన ఎగురవేయవచ్చు.
- ఒకవేళ జాతీయజెండా చిరిగిపోయినా, వెలసిపోయినా, పాడైపోయినా ఆ జెండాల గౌరవానికి భంగం కలుగకుండా భూమిలో పాతిపెట్టడం వంటివి చేయాలి తప్ప ఇతర వ్యర్థపదార్థాలతో పారవేయకూడదు.
- జెండాను, జాతీయ చిహ్నం అయిన 4సింహాలను ఎట్టిపరిస్థితుల్లోనూ వ్యాపారనిమిత్తం, ఇతర కార్యక్రమాలకు వాడకూడదు.
- జాతీయ జెండాను ఒక అలంకరణ వస్తువుగాగాని, టేబుల్‌పై క్లాత్‌గా, వస్త్రధారణగా వాడరాదు.
- జాతీయజెండాని దేశసార్వభౌమత్వానికి, దేశ గౌరవానికి ప్రతిష్టకి చిహ్నంగా భావించి భక్తి, శ్రద్ధలతో పతాకావిష్కరణ చేయాలి.
- జాతీయజెండాని బహిరంగ ప్రదేశాలలో ఆవిష్కరించినప్పుడు సూర్యోదయం తర్వాత ఆవిష్కరించి, సూర్యాస్తమయానికి ముందు అవనతం చేయాలి.
- జెండాపై ఎటువంటి అక్షరాలుగాని, ఇతరత్రా చిహ్నాలుగాని ముద్రించరాదు. జాతీయజెండాని జాతి గౌరవచిహ్నంగా తలచి అతిజాగ్రత్తగా నిబంధనలకి లోబడి ఎగురవేయాలి. కాని



ఇప్పుడు జరుగుతున్నది ఏమిటి? రాజకీయ నాయకులు, కార్యకర్తలు తమ ఫొటోలను జెండాలపై ముద్రించుకుంటున్నారు. గతంలో ఒక ఉపాధ్యాయుడు స్కూలు పతాకావిష్కరణ సభకి వచ్చిన రాజకీయ నాయకుడి మెప్పుకోసం ఆ నాయకుడి ఫొటో జెండాపై ముద్రించి, జెండాని ఆవిష్కరించి, అరెస్టు అయ్యారు. కానీ ఇటీవల స్వాతంత్ర్యదినోత్సం నాడు జెండారంగుల వస్త్రాలను ధరిస్తున్నారు. ఇది చట్టరీత్యా నేరం. ఒకప్పుడు జాతీయజెండా రంగులతో చేసిన డ్రెస్‌లను ధరించిన మందిరబేడి, మల్లికాషెరావత్ పలు విమర్శలకు గురయ్యారు. నేటి తరానికి ప్రదర్శన మమకారం బాగా పెరిగిపోయింది. సోషల్‌మీడియా ప్రభంజనంతో ప్రతీది పదిమందికి ప్రదర్శించుకోవడం మామూలు అయ్యింది. జెండాలను అగౌరవపరుస్తూ మీడియా దృష్టిని ఆకట్టుకునే ప్రయత్నంలో చిక్కుల్లో పడుతున్నారు. తర్వాత అరెస్టు అయి చింతించినా లాభం లేదు. కాబట్టి మన జాతీయజెండాను గౌరవిద్దాం, గౌరవప్రదంగా స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకుందాం. ముందుతరాలకు ఆదర్శంగా నిలుద్దాం.

**- నాగమణి కూచిమంచి**

---



# షుగర్ నివారణకు దాలియా పూలు!

అందం కోసం పెంచే డాలియా పూలను ఇక నుంచి మధుమేహాన్ని నివారించే సప్లిమెంట్‌గానూ వాడుకోవచ్చుట. ఈ పూలరేకుల్లోని పదార్థాలు మెదడును ప్రభావితం చేసి రక్తంలోని చక్కెర నిల్వలు స్థిరంగా ఉండేలా చేస్తాయని చెబుతున్నారు. న్యూజిలాండ్‌లోని ఒటాగో యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు. సాధారణంగా ప్రాథమిక దశలోనే చక్కెర వ్యాధిని గుర్తించి వ్యాయామం చేస్తూ ఆహార నియమాలు పాటిస్తూ బరువును అదుపులో ఉంచుకోగలగడం ద్వారా పూర్తిగా నివారించవచ్చు. ఈ విషయమై వీళ్ల ఈ పూలనుంచి సారాన్ని సేకరించి రకరకాల మోతాదుల్లో ఎలుకలకు ఐదు వారాలపాటు



ఇచ్చి పరిశీలించారట. అలా ఇచ్చినప్పుడు రక్తంలో గ్లూకోజ్ నిల్వలు అదుపులో ఉన్నట్లు గుర్తించారు. అయితే డాలియా పూల నుంచి సేకరించిన సారంలో బ్యూటైన్, ఐసో లిక్విరిటిజెనిన్, సల్ఫ్యూరెటిన్..అనే మూడుపదార్థాలూ ఉన్నప్పుడే అది మెదడును ప్రభావితం చేసి ఇన్సులిన్ ఉత్పత్తికి తోడ్పడుతున్నట్లు గుర్తించారు. ఈ ఎక్స్‌ట్రాక్ట్‌ను సప్లిమెంట్ రూపంలో తీసుకొస్తే ఎంతోమంది చక్కెల బాధితులకు ఉపశమనం కలుగుతుందని వివరిస్తున్నారు.



కథ

# చిట్టెలుక తెలివి

రాజపురం అనే గ్రామంలో రామయ్య అనే రైతు ఉన్నాడు. అతనికి నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో వరి పంట వేశాడు రైతు. బాగా పంట పండింది. రైతుకి మంచి లాభం వచ్చింది. తరువాత ఏడాది కూడా పంట బాగా పండింది. అయినా రైతుకు దిగుబడి లేదు. దానికి కారణం ఎలుకలు, పక్షులు పంటని తినడం గ్రహించాడు ఆ రైతు. అప్పుడు ఒక వలని పైరుపైన వేశాడు రామయ్య. ఎప్పటిలాగే ఎలుకలు, ముంగిసలు, పక్షులు ఆ పంట దగ్గరకు వచ్చాయి. ఎలుకలు ఎక్కువగా ఉండడం చూసి ఒక పిల్లి ఆ స్థలానికి వచ్చింది. ఆ పిల్లి రైతు వేసిన వలలో చిక్కుకుంది. ఒక చిట్టెలుక చిన్న రంధ్రం నుండి వచ్చి ధాన్యం తినటానికి పంట దగ్గరికి వెళ్లింది. అక్కడ పిల్లిని చూసి భయపడి దాని రంధ్రంలోకి వెళ్లి దాక్కోవాలనుకుంది. కానీ ఆ కన్నం దగ్గర ముంగిస ఉంది. పోనీ ఇంకో పక్కకు వెళ్దామంటే చెట్టుపైన కాకి ఒకటి ఉంది. ఎటు వెళ్లినా ప్రమాదమే అని ఆ చిట్టెలుక తెలివిగా ఆలోచించింది.



పిల్లివైపు చూసింది చిట్టెలుక. ఈ పిల్లి నాకు శత్రువే కానీ వలలో చిక్కుకుంది నన్నేమీ చేయలేదు. పిల్లి అంటే కాకికి, ముంగిసకి భయమే. అందుకు నేను పిల్లితో స్నేహం చేస్తా అని పిల్లి దగ్గరకు వెళ్లింది. 'అయ్యో! పిల్లి బావ వలలో చిక్కుకున్నావా?' అంది. అందుకు 'అవును చిట్టి మరదలా! నువ్వు ఈ వలను కొరికి రైతు వచ్చేలోపల నన్ను రక్షించు' అన్నది పిల్లి. 'హా! అలాగే బావ!' అని క్షేమ సమాచారమంతా అడుగుతుంది. నెమ్మదిగా వలను కొరుకుతుంది. వేగంగా వలను కొరికితే ఈ పిల్లి నన్ను తినేస్తుంది అని ఆలోచించింది ఎలుక. వలను మెల్లమెల్లగా కొరుకుతూ రైతు రావడం చూసి, అతను వచ్చేసరికి వల నుండి పిల్లిని విడిపించింది. రైతు వచ్చి కర్రతో పిల్లిని కొట్టాలనేసరికి..పిల్లి, ఎలుక, ముంగిస, కాకి అన్ని పరుగున పారిపోయాయి. హమ్మయ్య అనుకుంది చిట్టెలుక.

'చిట్టెలుక! నువ్వు చిన్న జీవివే అయినా సమయస్ఫూర్తితో నన్ను కాపాడావు. శక్తితో నిమిత్తం లేకుండా నీమీద నువ్వు నమ్మకంతో అపాయంలో మంచి ఉపాయం ఆలోచించావు. ఎవరికైనా ఆపద సమయంలో కావాల్సింది అదే' అన్నది పిల్లి. ఇంకా మిగతా పక్షులు, ఎలుకలు, ముంగిసలు అభినందనలతో ముంచెత్తాయి చిట్టెలుకను.

- బల్ల కృష్ణవేణి

## రంగులు వేయండి..





వార్త ఆదివారం

## బాలగేయం

### బాబోయ్ వర్షాలు



వానా..వానా..వానా..
రోజంతా వర్షమే
పారే నీళ్లపై
పేపర్‌తో పడవను చేసి,
వదిలాను
నా పక్కింటి గల్లీ
నుంచి మరో గల్లీకి
చేరుకుంది నా పడవ
రారండి..రారండి
పిల్లల్లారా నా పడవను
చూడరండి...
బడితలుపులు
మూసుకున్నాయి
ఆకాశమంతా మబ్బులతో
పగలే రేయిగా మారింది
చీకట్లో కొట్టుకుపోతున్న
నాపడవను వెంబడిస్తూనే
ఉన్నాను..
దానిగమ్యం ఓ నది
నా గమ్యం నాఇల్లు
పడవను తల్లుకుంటూ
నిద్రపోయాను..

**- రూతు**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.కార్తిక,** నాయుడుపేట

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వలస పక్షులకు మనదేశంలో అనువైన కేంద్రం ఏది?

**జవాబు: కార్తిక!** వలస పక్షులకు బాగా అనువైన కేంద్రాలలో రాజస్థాన్‌లోని భరత్‌పూర్ మొదటి స్థానంలో నిలుస్తుంది. సుమారు 550కి పైగా జాతుల పక్షులు సేద తీరే భరత్‌పూర్ అభయారణ్యం జీవ శాస్త్రవేత్తల పరిశోధనలకు కేంద్రంగా ఉపయోగపడుతుంది. దీని తర్వాత పులికాట్ సరస్సు తర్వాతి స్థానంలో నిలుస్తుంది.

**- ఎన్.అయాన్,** నాందేడ్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. బాక్టీరియా కారణంగా కొన్ని వ్యాధులు వస్తాయని అంటారు? ఎలా?

**జవాబు: అయాన్!** మన శరీర కణజాలంలో చాలా వేగంగా బాక్టీరియా కణాలు వృద్ధి చెందడం వల్లనే ప్రమాదకరమైన వ్యాధులు ఏర్పడతాయి. ఒక బాక్టీరియా ఒక రోజులో దాదాపు కోటి అరవై లక్షల కణాలను ఉత్పత్తి చేయగలదు. కనుకనే ఎంతో త్వరగా శరీరంలో ప్రవేశించిన బాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఉదా: బాక్టీరియల్ న్యూమోనియా వ్యాధి వచ్చినప్పుడు బాక్టీరియా ఊపిరితిత్తుల లోలోపలికి చొచ్చుకుపోయి, వాయుమార్పిడి జరిగే గాలితిత్తుల్లో చాలా వేగంగా అభివృద్ధి చెందుతుంది. తత్ఫలితంగా ఊపిరితిత్తులు సాధారణ రీతిలో పనిచేయలేవు. కొన్ని రకాల బాక్టీరియా వివిధ రకాల విష పదార్థాలను సైతం స్రవించడంతో అవి పలురకాల వ్యాధులకు కారకాలవుతాయి. ఉదాహరఖు 'టెటనస్ బాసిల్లస్' అనే బాక్టీరియా విడుదల చేసే నాడీ విష పదార్థాల కారణంగా ధనుర్వాతం వస్తుంది. ఇది కండరాల మీద, నరాల మీదా ప్రభావం చూపించడంతో శ్వాసక్రియకు ఆటంకం ఏర్పడి ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంటుంది.



# ఈతరం పిల్లలు

**ఒకప్పటి పిల్లలు సెలవుదినాల్లో గ్రంధాలయాలకు వెళ్లి కథల పుస్తకాలు తెచ్చుకుని చదివి ఆనందించేవారు. వారికి పాఠశాలల్లో కూడా గ్రంధాలయం తప్పనిసరిగా వుండేది. అందులో తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లోని పుస్తకాలు అందుబాటులో ఉండేవి. 'మోరల్' క్లాసులంటూ పిల్లలకు జరిగేవి. వాటిలో ఉపాధ్యాయులు నీతికథలు చెప్పేవారు. ఏ సబ్జెక్టు ఉపాధ్యాయుడైనా ఆరోజు పాఠశాలకు సెలవుపెడితే ఖాళీగా వున్న ఉపాధ్యాయులు బాలసాహిత్య పుస్తకాల కట్టలు తీసుకుని తరగతి గదికి వెళ్లి పిల్లలందరికీ తలో పుస్తకం ఇచ్చి చదువుకోమనేవారు.**

ఇంకా పిల్లలకు రీడింగ్‌రూమ్ తరగతులుండేవి. అక్కడకు వెళ్లి చందమామ, బాలమిత్రలాంటి కథల పుస్తకాలు చదువుకునేవారు. అలా ఆనాటిపాఠశాలలు తమ బాధ్యతగా పిల్లలను సాహిత్యంపట్ల మళ్లిం చేందుకు తమవంతుగా కృషి చేశారు. కాని ఈనాటి పాఠశాలల్లో సాంకేతికాభివృద్ధి పేరిట కేవలం కంప్యూటర్ క్లాసులు మాత్రం కొన్నిచోట్ల జరుగుతున్నాయి. మిగతా చోట్ల అదీ లేదు.

ఆనాడు సాహిత్యాభిరుచి కలిగిన తల్లిదండ్రులు పిల్లల పఠనాసక్తిని గమనించి పిల్లలకు నెలనెలా చందమామలాంటి పత్రికలు తెప్పించి ఇచ్చేవాళ్లు. ఇంట్లో పెద్దవాళ్లూ పుస్తకాలు చదువుతూ వుండేవారు. తీరికవేళల్లో మగవారు గుడిమంటపాలలో, పురాణ కాలక్షేపాలంటూ, భాగవత, భారతాలను ఒకరు చదువుతూ వుంటే పదిమందీ వినేవారు. ఇక ఇళ్లలోని ఆడవారు కూడా పదిమందీ ఒకచోట చేరి మధ్యాహ్న సమయాలలో ఒకరి ఇంట్లో వ్యాసపీఠం పెట్టించుకుని దాంట్లో ఏదేవీ భాగవతమో వుంచి చదివించుకుని వింటూ పరవశించిపోయేవారు. కాని ఈరోజుల్లో ఏస్థాయిలోని ఆడవారి చేతిలో చూసినా సెల్‌ఫోనే. పుస్తకం పట్టుకునే చేతులే కనబడటం లేదు. వారిని చూసి చూసి పిల్లలూ అదేబాటలో నడుస్తున్నారు. ఈనాటి పిల్లలంతా సెల్‌ఫోన్లకు బానిసలు అయిపోతున్నారని అంతటా ఒకటే గగ్గోలు. కాని వారి తల్లులు పిల్లలకు అన్నం తినిపించే వయస్సునుంచి సెల్‌ఫోన్లలో బొమ్మలు, డాన్సులూ చూపిస్తూ అన్నం తినిపించటం అలవాటు చేస్తున్నారు. దాంతో వాళ్లకు అక్కడే సెల్‌ఫోన్ జాడ్యం వంటబట్టిపోతున్నది. క్రమేణా అది పెరిగి పెద్దవుతూ వారు పరిసరాలను కూడా మర్చిపోతు న్నారు. పాలపాకెట్టు తెచ్చిచ్చే పాలమనిషి సెల్‌ఫోన్ చూస్తూనే లీటరు పాలపాకెట్టు ఇవ్వాల్సిన వాళ్లకు అరలీటరో, పావులీటరుపాకెట్లో పెట్టిపోతున్నాడు. పేపర్ వేసే కుర్రాడు సెల్‌ఫోన్ చూసుకుంటూనే ఒకదిన పత్రిక బదులు, మరొక దినపత్రిక వేసిపోతున్నాడు. ఇక వాహనాలలో ప్రయాణించే వారికి కూడా చేతిలో సెల్‌ఫోన్, చెవిలో ఇయర్‌ఫోనో వుండాల్సిందే. దాంతో ఎన్నో ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు.



నేడు చదువుకునే పిల్లలకు చేతిలో తరగతి పుస్తకాలుండవు. తాము చదవాల్సిందంతా ఫోన్‌లోనో, ఐపాడ్‌లోనో, కంప్యూటర్‌లోనో చూసుకుంటున్నారు. అన్నం తినకుండా అయినా నేటి పిల్లలు వుండగలరేమో కాని సెల్‌ఫోన్ లేకుండా ఖాళీసమయాలు అస్సలు గడపరు. సెలవురోజు వస్తే వాళ్లు ఏ ఫంక్షనుకు రావటానికి కూడా ఇష్టపడడం లేదు. ఆ రోజంతా ఫోన్‌లోనే గేమ్స్ ఆడుకుంటూ ఇంట్లో వుండటానికే ఇష్టపడుతున్నారు. ఇంట్లో వాళ్లంతా ఫంక్షన్లకు వెళ్లినా సరే ఫోన్‌లోనే ఏ 'జుమాటో, స్విగ్గి' వారికి ఫుడ్ ఆర్డర్ పెట్టి తెప్పించుకుని తినేందుకు అలవాటు పడుతున్నారు.

అలా కాకుండా తాతా, అమ్మమ్మలు, బామ్మా తాతయ్యలున్న ఊళ్లకు సెలవురోజుల్లో వీళ్లను పంపితే పిల్లలు అక్కడి వాతావరణానికి, బంధుత్వాలకు అలవాటు పడతారు. త్వరలోనే స్నేహితులను కూడా ఏర్పరచుకుంటారు. సెల్‌ఫోన్లు పక్కన పెట్టేస్తారు. అలా వీలుకాకపోతే తామున్న చోటైనా తల్లిదండ్రులు పిల్లలను ఆడుకునేందుకు బయటకు



పంపించాలి. ఇంట్లో పెద్దవాళ్లు ముందుగా వాళ్లతో కారమ్స్, చదరంగం లాంటివి ఆడి వాళ్లకూ నేర్పి ఆసక్తి కల్గించాలి. ఈ రోజుల్లో చాలాచోట్ల ఆటలు ఆడించే స్టేడియమ్స్ వుంటున్నాయి. వీలున్నంతవరకు పిల్లలకు వాటి దగ్గరకు పంపించాలి. ముఖ్యంగా పిల్లలకు రాత్రిపూట కథలు చెప్పే అలవాటు చేసుకోవాలి. దానికోసం పెద్దలు ముందుగా నీతికథల పుస్తకంలాంటివి చదివి గుర్తుపెట్టుకోవడం అలవాటు చేసుకోవాలి. అలా కాకుండా వాళ్లు తీరిగ్గా ఫోన్ చూసుకుంటూ వుంటే పిల్లలూ అదే చేస్తారు. అవసరమున్నంతవరకే ఫోన్‌ను వాడాలి. ఈనాటి శాఖా గ్రంధాలయాలలో పిల్లలకు వేసవిసెలవుల్లో గ్రంధాలయశిక్షణాతరగతుల పేరిట వివిధ కార్యక్రమాలు నేర్పిస్తున్నారు. వాటికి పిల్లలను పంపించాలి. కొన్ని సేవాసంస్థలు కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతూ పిల్లల పురోగతికి పాటుబడుతున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడాలాంటి దేశాలలోని వివిధ ప్రాంతాలలో 'మనబడి'శాఖలు నిర్వహిస్తూ తెలుగుభాషాభివృద్ధికి, సాహిత్యాభిరుచికి పాటుపడుతున్నారు. విదేశాలలోని ప్రవాసాంధ్రుల పిల్లలు సామూహికంగా చేరి భగవద్గీత శ్లోకాలు వినిపిస్తున్నారు. ఇక్కడ మన పిల్లలకు భగవద్గీత తెలియదు. శ్లోకాలు తెలియదు. మనకన్నా ప్రవాసాంధ్రుల వీధులకు, దుకాణాలకు తెలుగులోనే పేర్లు రాసుకోవడం చేస్తూ తమ ఉనికిని చాటుకుంటున్నారు. మనమిక్కడ జరుపుకునే పండుగలూ, పబ్బాలకన్నా, సాహిత్యకార్యక్రమాలకన్నా వారెక్కువగా సంప్రదాయబద్ధంగా జరుపుకుంటూ మన సంస్కృతిని కాపాడుకుంటున్నారు. అక్కడి ఆడపిల్లలు లంగాఓణీలతో కనబడుతున్నారు. ఆంగ్లభాషామాధ్యమాలు చదవచ్చు. కాని తెలుగు భాషను అధికారులూ, పిల్లలూ పక్కనపెట్టేయకూడదు. ఇటీవల అమెరికాలో స్థిరపడిన 86 ఏళ్ల డాక్టరు ఇండియా వచ్చినప్పుడు కలిశాం. వారింకా వైద్యవృత్తిలోనే వున్నారు. నాడు తాను చదివిన ప్రాచీన కావ్యాలలోని పద్యాలు, ఆధునిక కవుల కవిత్వాన్ని, కథకుల, నవలాకారుల రచనల గురించి అనర్గళంగా వినిపించారు. అలనాటి తన తెలుగు ఉపాధ్యాయుల ద్వారా నేర్చుకున్న తెలుగుభాషను పదేపదే స్మరించుకున్నారు. పిల్లలకు స్నేహితులు ఉండాలి. సెల్‌ఫోనే స్నేహితుడుకాకూడదు. తమతోటి వారితో ఎక్కువగా మాట్లాడాలి. ఈరోజుల్లో అపార్ట్‌మెంట్‌ల సంస్కృతి ఎక్కువైంది. అక్కడ కూడా తమ తోటి పిల్లలతో కలిసి ఆడుకునేదిశగా ప్రోత్సహించాలి. ఒకరి ఆలోచనలు మరొకరితో పంచుకునేటట్లుగా నేర్పాలి. ఈనాటి పెద్ద పిల్లలు కూడా తిండి తినేటప్పుడు సైతం ఫోన్‌ను వదలిపెట్టటం లేదు. ఏంతింటున్నామో అవగాహన లేకుండా వుంటున్నారు. పైగా అందులో చూసి హింస, అశ్లీలతలవైపు దృష్టి సారిస్తున్నారు. స్నేహితులతో ఎక్కువ సమయం గడిపితే ఈ ధోరణి మారుతుంది. ఈమధ్య అమెరికా నుండే మిత్రులొకరు వాట్సాప్ పంపారు. 'మా మనుమడు చదివే స్కూల్‌కెళ్లాను. అక్కడ ఒక రంగురంగుల బెంచీ వేసివున్నది. అదేమిటని మా మనుమణ్ణి అడిగాను. 'స్కూల్లో కొత్తగా చేరినవారికి మిత్రులెవరూ వుండరు. ఆడుకోవటానికి తోడు ఎవరూ రారు. అలాంటిస్థితిలో వారొచ్చి ఆ బెంచీమీద కుర్చుంటారు. అలా కూర్చోవటం చూసిన వారెవరైనా స్పందించి దగ్గరకొచ్చి, పరిచయం చేసుకుని స్నేహితులవుతారు. అందుకని అది స్నేహితుల బెంచీ తాతగారు' అని చెప్పాడు. ఈ ఆలోచన ఎంతో బాగుందనిపించింది. ఇండియాలోని మిత్రులందరితో ఈ విషయం పంచుకుంటునానన్నారు. పిల్లలకు వివిధ విషయాలలో ఆసక్తి కల్గించాలి. దాంట్లో పుస్తక ప్రాధాన్యత, చదువుపై ఆసక్తి తెలియజేయాలి. 'బేసిక్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ సెంటర్ వారు బాలసాహిత్యాన్ని సేకరించి, కొన్నింటిని తామే స్వయంగా ప్రచురించి ఎన్నోవేల కాపీలను పాఠశాలల గ్రంధాలయాలకు ఉచితంగా అందజేస్తున్నారు. వేసవి సెలవుల్లో వాటిని చదివి సమీక్ష రాసి పంపిన పిల్లలకు బహుమతుల రూపంగా మరలా పుస్తకాలనే అందజేస్తున్నారు. హైదరాబాద్ 'మంచి పుస్తకం' వారు తానా వారి సహకారంతో కూడా ఎన్నో బాలసాహిత్య పుస్తకాలను అచ్చువేస్తున్నారు. ఇలా కొంతమంది తమవంతుగా కృషి చేస్తున్నారు. వీటిని పిల్లలు అందిపుచ్చుకోగలిగితే పిల్లల హస్తభూషణంగా మళ్లీ పుస్తకమే వస్తుంది. సెల్‌ఫోన్ దూరమవుతుంది. గుంటూరులోని అన్నమయ్య గ్రంధాలయం లక్షకుపైగా పుస్తకాలను సేకరించి పిల్లలకు, పెద్దలకూ పుస్తకాలను అందుబాటు వుంచుతున్నారు. సిబ్బందికి జీతభత్యాలనిచ్చి మరీ సాహిత్య సేవ చేస్తున్నారు. అక్కడే వున్న అన్నమయ్య కళావేదిక ప్రతిరోజూ ఉచిత సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలకు తెరతీసింది. పిల్లలు కూడా వీటిని దర్శించి సద్వినియోగం చేసుకోవచ్చు. ఇలాంటి సంస్థలను మరికొంతమంది ఆదర్శంగా తీసుకుంటే సమాజానికి మేలు కలుగుతుంది. నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి వీళ్లను సరైన దిశలో నడిపించగలిగితే సమాజమంతా అభివృద్ధి జరుగుతుంది.

**- దాసరి శివకుమారి**



కథ

# కన్యాదానం

ఈదర శ్రీనివాసరెడ్డి

“ఇందాకటి నుండి ఆ ఫోను మెడ తెగిన మేకలా అరుస్తూ ఉంటే పట్టించుకోకుండా వంటింట్లో ఏం చేస్తున్నావు? బంగారం లాంటి నిద్ర పాడు చేసింది వెధవ ఫోను.. వెధవ ఫోను” కప్పుకున్న దుప్పటి ముసుగు ఏమాత్రం తీయకుండానే బెడ్ రూమ్‌లో నుంచి పెద్దగా అరిచాడు వినయ్, నిద్ర పాడైందనే చిరాకుతో.

“ల్యాండ్‌లైన్‌కి మీ అమ్మగారు తప్ప ఫోన్ ఎవరు చేస్తారు? మీరే లేచి ఫోన్ తీసి మాట్లాడండి” వంటింట్లో నుంచే అరుస్తూ జవాబిచ్చింది సురేఖ.

“ఏం? మా అమ్మ ఫోన్ అయితే నువ్వు ఎత్తి మాట్లాడకూడదా?” ముసుగు తీయకుండానే మళ్లీ అరిచాడు వినయ్.

“ఆవిడగారు నేను ఫోను ఎత్తితే జవాబు ఇవ్వదు కదా? అయినా మీ తల్లి కొడుకుల మధ్య నేను ఎందుకు చెప్పండి, మీకేం రహస్యాలు ఉన్నాయో? మీరే వచ్చి ఫోన్ తీయండి” అంటూ అదే స్థాయిలో మళ్లీ తిరిగి జవాబు ఇచ్చింది సురేఖ.

ఇక తప్పదు అనుకుంటూ కప్పుకున్న దుప్పటి ముసుగు తీసేసి “ఛ..ఛ.. వెధవ ఫోన్లు.. ఆదివారం కూడా కాసేపు పడుకోనివ్వరు” అని తనలో తనే గొణుక్కుంటూ ల్యాండ్ లైన్ రిసీవర్ అందుకుని చెవి దగ్గర పెట్టుకుని మళ్లీ కళ్లు మూసుకున్నాడు. వినయ్ నిలబడే నిద్రపోతున్నవాడిలా.

అవతలివాళ్లు చెప్పేదంతా మౌనంగా వింటూ, ఒక ఐదు నిమిషాల తర్వాత, ఉలుకు పలుకు లేకుండా రిసీవర్ని ఫోన్ మీద పెట్టేసి నిద్రలో నడిచేవాడిలా నడుచుకుంటూ బెడ్ రూమ్‌లోకి వెళ్లి మళ్లీ ముసుగుతన్ని పడుకున్నాడు. వినయ్.

ఏ విషయం తనకు చెప్పకుండా భర్త మళ్లీ ముసుగు తన్నేయడంతో కాస్తం కోపంతో “ఎవరండీ ఫోను? మీ అమ్మగారేనా?” వంటింట్లో నుంచి సురేఖ అరిచింది.

అప్పటికే దాదాపుగా నిద్రమత్తు వదిలిపోవడంతో ఇక నిద్ర పోవడం సాధ్యపడదని నిర్ణయించుకుని, కప్పుకున్న ముసుగు తీసేసి లేచి కూర్చుని–

“అవునుగానీ ముందు ఒక కప్పు కాఫీ నా ముఖాన తగలెయ్, తర్వాత అన్ని విషయాలు మాట్లాడుకుందాం” అంటూ జవాబిచ్చాడు వినయ్.

అత్తగారు ఏం మాట్లాడిందో తెలుసుకోవాలనే ఆతృతతో, అర నిమిషంలో కాఫీ కప్పుతో మొగుడి ఎదురుగా నిలబడింది.

కాఫీకప్పు అందుకుంటూ “అత్తగారి ఊసంటేనే పడదు, కానీ మళ్లీ ఆవిడ ఏం మాట్లాడిందో మాత్రం పూస గుచ్చినట్టు అన్నీ కావాలి” సురేఖను దెప్పి



పొడిచ్చాడు వినయ్.

“మీరు, ఆవిడగారు ఏం మాట్లాడుకుంటే నాకెందుకు? కాకపోతే నా గురించి ఏమన్నా మీకు చాడీలు చెప్పిందేమోనని..” అంటూ సాగదీసింది సురేఖ.

“అనుమానం పుట్టి, మీ ఆడవాళ్లు పుట్టారనుకుంటా, పొద్దస్తమానం ఏముంటాయి? నీ గురించి ఆవిడ నాకు చాడీలు చెప్పడానికి” అంటూ తల్లిని వెనకేసుకొచ్చాడు వినయ్.

“సరేలెండి, ఎప్పుడూ మీ అమ్మా కొడుకులు ఒకటే, నేనే బయటిదాన్ని. ఇంతకీ తెల్లవారకముందే ఆవిడగారు ఎందుకు ఫోన్ చేసిందో, అదన్నా చెప్తారా? లేక నా వంటపని నన్ను చూసుకోమంటారా?” అంటూ మూతి మూడు వంకర్లు తిప్పింది సురేఖ.

ఇంకా ఆలస్యం చేస్తే ఈ పూటకి బ్రేక్‌ఫాస్ట్ బయట హోటల్లో చేయాల్సి వస్తుందని భయపడి “ఏం లేదోయ్, చెల్లికి మంచి సంబంధం కుదిరిందట, మనం కూడా ఒకసారి చూసి ఒకే అంటే నిశ్చితార్థం చేస్తుందట అమ్మ. అది చెప్పడానికే ఫోన్ చేసింది” అంటూ అసలు విషయం బయట పెట్టాడు వినయ్.

“చెల్లెలా! ఎవరి చెల్లెలు? మీకు తమ్ముడు ఉన్నాడుగానీ, చెల్లెలు కూడా ఉన్నట్టు నాకు ఎప్పుడూ చెప్పలేదు మీరు?” మొహం నిండా ఆశ్చర్యం పులుముకున్నదానిలా భర్తను అడిగింది సురేఖ.

“ఏమిటోయ్, నీకు అన్నీ తెలిసి కూడా అలా మాట్లాడతావు? గౌరి నీకు తెలియదా? మన పెళ్లయిన దగ్గర నుండి అమ్మ పెంచుకుందిగా?” అంటూ గుర్తు చేశాడు వినయ్.

“ఓ... ఆ గౌరా? ఆ పని పిల్లా? మరి చెప్పారు కాదు, చెల్లెలు అంటే ఇంకా ఎవరో అనుకున్నాను” సందేహం తీరిన దానిలాగా ఓ నిట్టూర్పు విడిచింది సురేఖ.

“అవును, ఆ పనిపిల్ల గౌరికే మంచి సంబంధం కుదిరిందట. అమ్మ మనల్ని కూడా వచ్చి చూడమంటోంది, వెళ్దామా?” భార్య అంతరార్థం అర్థమైనవాడిలా బతిమిలాడుతున్నట్టు అడిగాడు.

"అయినా ఇదెక్కడి చోద్యం అండీ! ప్రపంచంలో నేను ఎక్కడా చూడలేదు. పనిపిల్లని పెంచుకోవడం ఏమిటి? దానికి చదువు చెప్పించటం ఏమిటి? ఇప్పుడు పెళ్లిళ్లు, పేరంటాలు అంటూ మనల్ని పిలవటం ఏమిటి? అయినా అంతగా పెంచుకోవాలనుకుంటే మన అమ్మాయిని పెంచుకోవచ్చు కదా!" అత్తగారి మీద తన అక్కసు మొత్తం వెళ్లగక్కింది సురేఖ.

"అన్నీ తెలిసినవాళ్లకైనా చెప్పొచ్చు లేక ఏమీ తెలియనివాళ్లకైనా చెప్పొచ్చు.

అన్నీ తెలిసీ తెలియనట్టు నటించే సురేఖకు ఏమి చెప్పినా ఉపయోగం లేదని మౌనంగా ఉండిపోయాడు వినయ్.

....

"అదేమిటమ్మా? ఇద్దరు కొడుకులం మేం ఉండగా నువ్వు ఒక్కదానివే ఇక్కడ ఉంటాను అంటావు. మా దగ్గరకు వచ్చేయొచ్చు కదా? నువ్వు ఒక్కదానివే ఇక్కడ ఉంటే ఊళ్లో వాళ్లందరూ ఏమనుకుంటారు చెప్పు. మేం నిన్ను సరిగా చూసుకోవట్లేదని అనుకోరా?" తల్లిని బతిమిలాడుతున్నట్టు అడిగాడు వివేక్.

"ఊళ్లోవాళ్ల ఏదో అనుకుంటారని తప్ప, నా మీద మీకు నిజంగా ప్రేమ లేదన్నమాట" కొడుకుల్ని అడిగింది అనసూయమ్మ.

"ప్రేమ ఉండబట్టే కదమ్మా, చెరొక ఆరు నెలలు మేం ఇద్దరం నిన్ను మా దగ్గర ఉంచుకుంటున్నాం" ఏదో ఘనకార్యం చేసినవాళ్లలాగా జవాబిచ్చారు అన్నదమ్ములు ఇద్దరు.

"అమ్మను కూడా తూకం వేసి ఆరు నెలలు, ఆరు నెలలు పంచుకునే మీ లాంటి కొడుకుల దగ్గర ఉండలేకే నేను ఈ నిర్ణయం తీసుకున్నాను. నన్ను ఇలాగే ఇక్కడ ఉండనివ్వండి, మీ నాన్నగారి జ్ఞాపకాలతో నా చివరి రోజులు సంతోషంగా గడపనివ్వండి" తన నిర్ణయానికి తిరుగు లేదన్నట్టు కొడుకులకు స్పష్టం చేసింది అనసూయమ్మ.

"అదేంటి అత్తయ్యా, అలా అంటారు? హైదరాబాదు లాంటి సిటీలో ఒక మనిషిని పోషించడానికి ఎంత ఖర్చు అవుతుందో మీకు తెలియంది కాదు. అందుకే మేం చెరొక ఆరు నెలలు మిమ్మల్ని చూస్తున్నాం" తాము చేస్తున్న దాంట్లో ఏమీ తప్పులేదు అన్నట్టు సమర్థించడానికి ప్రయత్నించింది చిన్న కోడలు సుషమ.


"ఇద్దరు పిల్లల్ని పెంచడం కష్టమని, నేను మీ మామగారు కూడా అనుకుని ఉంటే మీ ఆయన భూమి మీద పడేవాడే కాదమ్మా!" చిన్న కోడలికి చురక అంటించింది అనసూయమ్మ.

"అది కాదు అత్తయ్యా, మీకు ఏదైనా జబ్బు చేసిందనుకోండి, ఇక్కడ ఎవరు చూస్తారు చెప్పండి?" మరో ప్రశ్న వేసింది పెద్ద కోడలు సురేఖ.

"మీ దగ్గర ఉన్నప్పుడు మాత్రం నాకు జబ్బు చేసినప్పుడు ఎవరు చూశారు అమ్మా? మీ మానాన మీరందరూ ఉద్యోగాలకు వెళితే నేను మాత్రం మంచానికి అతుక్కుపోయాను. ఏదో అదృష్టం బాగుండి బతికి బయట పడ్డాను. కానీ.." అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది అనసూయ.

"ఏం చేస్తాం చెప్పమ్మా? అందరం ఉద్యోగాలు చేసేవాళ్లమే కదా! వాటిని వదిలి నీ దగ్గర ఉండలేం కదా. అయినా నీకు జబ్బు చేసినప్పుడు నిన్ను చూసుకోవటానికి పనిమనిషిని పెట్టాం కదా" అనసూయమ్మను సముదాయించడానికి ప్రయత్నించాడు పెద్ద కొడుకు వినయ్.

"నేను కూడా అదే నాన్నా చెప్పేది. ఆ పనిమనిషిని ఏదో ఇక్కడే పెట్టుకుని, బతికిన నాలుగు రోజులు ఇక్కడే కాలక్షేపం చేసేస్తాను. పైపెచ్చు నాకేదైనా అయితే ఇక్కడ చుట్టుపక్కల వాళ్లందరూ నా కోసం ప్రాణం ఇస్తారు. మీ నాన్నగారి చివరి క్షణాల్లో కూడా వీళ్లందరూ కంటికి రెప్పలా కాచుకున్నారు. కానీ ఏం చేస్తాం? ఆ పైవాడు దయ తలచందే. మీకు ఇక నేను ఏమాత్రం భారం కాదల్చుకోలేదు" నిష్కర్షగా తన నిర్ణయాన్ని కొడుకులిద్దరికీ తెలియజెప్పింది అనసూయమ్మ.




ఇక చేసేదేమీ లేదు అన్నట్టు, అన్నదమ్ములు ఇద్దరూ తల్లి ఖర్చులకోసం నెల నెలా డబ్బులు పంపుతామని చెప్పారు. ఆ నిర్ణయాన్ని కూడా అనసూయమ్మ సున్నితంగా తిరస్కరించింది.

"నాకు ఈ పల్లెటూర్లో ఏం ఖర్చులు ఉంటాయి చెప్పండి. ఉండటానికి మీ నాన్నగారు లంకంత ఇల్లు ఇచ్చిపోయారు. ఇంట్లో సగం అద్దెకిస్తాను, ఆ వచ్చే అద్దెతో కృష్ణా.. రామా అంటూ కాలం గడిపేస్తాను. మీరు నా గురించి ఆలోచించకుండా మీ పిల్లల గురించి ఆలోచించండి. అసలే సిటీలో ఖర్చులు ఎక్కువ" తన వాళ్ల దయాదాక్షిణ్యాల మీద బతకాల్సిన అవసరం లేదని చెప్పకనే చెప్పింది అనసూయమ్మ.

....

"అమ్మగారూ, ఇంటి పని, వంట పని అంతా మీరు ఒక్కళ్లే ఎలా చేసుకుంటారు? పోనీ నా కూతుర్ని మీ దగ్గర పనిలో పెట్టమంటారా?" అడిగింది తమ దగ్గర ఒకప్పుడు పాలేరుగా పని చేసిన సోమయ్య భార్య తులసమ్మ.

"వద్దు తులసమ్మా, దాని జీవితం ఎందుకు పాడు చేస్తావు? దానిని చక్కగా చదివించి ఒక అయ్య చేతిలో పెట్టు" అంటూ తులసమ్మ విన్నపాన్ని సున్నితంగా తిరస్కరించింది అనసూయ.

"ఇప్పుడు అది చదివి ఏ ఊళ్లు ఏలాలి అమ్మా? అయినా మా బోటి రెక్కాడితేగానీ డొక్కాడని వాళ్లకు చదువులు చెప్పించే స్థోమత ఎక్కడుందమ్మా?" తన నిస్సహాయతను బయట పెట్టుకుంది తులసమ్మ. సోమయ్య పోయిన దగ్గర నుంచి తులసమ్మే నాలుగిళ్లలో పని చేస్తూ తన పిల్లల్ని పెంచి పోషిస్తోంది. అప్పటికప్పుడు ఏదో ఆలోచన వచ్చినదానిలా "అయితే పని చేయి తులసమ్మా, నీ కూతుర్ని నా దగ్గర అట్టిపెట్టు. దానిని నేను చదివిస్తాను, నాకు తోడుగాను అది ఉంటున్నట్టు ఉంటుంది... ఏమంటావ్?" అడిగింది అనసూయమ్మ.

"దాన్ని మీరు చదివిస్తాను అంటే మాకు అంతకంటే ఏం కావాలమ్మా?" రెండు చేతులు ఎత్తి జోడించి నమస్కరించాడు.

ఆ రోజు నుండి సోమయ్య కూతురు గౌరి అనసూయమ్మ ఇంట్లో పనిపిల్లగా చేరింది. పేరుకు పనిపిల్లే. కానీ అనసూయమ్మ సొంత కూతురు కన్నా ఎక్కువగా చూసుకోవడం మొదలుపెట్టింది. వాళ్లిద్దర్నీ చూసినవాళ్లు నిజమైన తల్లీకూతుళ్లు అనుకుంటారు తప్ప ఎవరికీ గౌరి ఓ పనిపిల్ల అనే అనుమానం ఏమాత్రం కలగదు.

తులసమ్మకు మాట ఇచ్చినట్లే గౌరిని డిగ్రీ వరకు చదివించింది అనసూయమ్మ.

ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం కూడా సంపాదించుకుంది గౌరి.

ఇప్పుడు గౌరికి తనే ఓ మంచి సంబంధం చూసి పెళ్లి చేద్దామని నిర్ణయించుకుంది. అనుకున్నట్లే గౌరి అదృష్టమో లేక అనసూయమ్మ సంకల్ప బలమో తెలియదుగానీ ఒక మంచి సంబంధం కుదిరింది.

....

"ఇంతకీ మీ తమ్ముడు, మరదలు కూడా వచ్చారా పెళ్లిచూపులకి? తగుదునమ్మా అంటూ మీరు వెళ్లి వచ్చారు" సన్నాయి నొక్కులు నొక్కింది సురేఖ.

"వాడు రాకుండా ఎలా ఉంటాడు? ఎంతైనా మా ఇద్దరి రక్తం, ఆలోచనలు ఒకటే కదా?" సమాధానం ఇచ్చాడు వినయ్.

ఆ జవాబుతో మొఖం పాలిపోయిన దానిలా "మరి మీ మరదలు కూడా వచ్చిందా?" అంటూ నసిగింది సురేఖ.

"ఆ అమ్మాయి ఎందుకు వస్తుంది? ఎంతైనా నీలాగా బయటిది కదా?" నిర్మొహమాటంగా అన్నాడు వినయ్.

"అవునులెండి కట్టుకున్న పెళ్లాలు మాత్రం బయటవాళ్లు, ఎవరో పనిపిల్ల మాత్రం మీకు, మీ తమ్ముడికి ఎక్కువైంది" ఉడుక్కుంది సురేఖ.

"ఇంతకీ కట్నకానుకలు ఏమిస్తోందంట మీ అమ్మగారు?" వెక్కిరింతంగా అడిగింది సురేఖ.

"పెళ్లికొడుకు తల్లిదండ్రులు చాలా మంచివాళ్లు. వాళ్లు కట్నకానుకలు ఏమీ అడగలేదు. నిజంగా గౌరి చాలా అదృష్టవంతురాలు" మొహం మీద కొట్టినట్టు చెప్పాడు వినయ్.

"మరి.. కనీసం పెళ్లి అన్నా చేయాలిగా, సొంత కూతురులాగా పెంచుకున్నందుకు, మీ అమ్మగారు?" కడుపుమంట ఇంకా తీరనట్టు ప్రశ్నించింది సురేఖ.

"అమ్మ దగ్గర డబ్బులు ఏముంటాయి చెప్పు? ఇంటి మీద వచ్చే అద్దెతోనే ఇన్నాళ్లూ కాలం గడుపుతూ వస్తోంది. అందుకనే మేం అన్నదమ్ములం ఇద్దరం పెళ్లిఖర్చులు భరించటానికి ఒప్పుకున్నాం" అసలు విషయం చల్లగా బయట పెట్టాడు వినయ్.

"నేను అనుకుంటూనే ఉన్నా ఇలాంటిదేదో జరుగుద్దని. ఎవరిని అడిగి మీరు పెళ్లి ఖర్చు భరిస్తానని చెప్పారు. లక్షలకు లక్షలు మీరు బయటవాళ్ల కోసం తగలేస్తూ ఉంటే నా పిల్లల గతి ఏంకాను? అహం చల్లారని సురేఖ పెద్దగా అరవడం మొదలుపెట్టింది.

"ఎందుకలా అరుస్తావ్? ఈ పది పన్నెండేళ్లు అమ్మ మన దగ్గర ఉంటే ఎంత ఖర్చు అయ్యేది చెప్పు? ఆ డబ్బులే ఇప్పుడు పెళ్లి ఖర్చులకోసం ఇద్దరం ఖర్చు చేస్తున్నాం. ఇందులో నీ పిల్లలకు అన్యాయం ఎక్కడ జరిగింది" సురేఖ నోరు మూయించాడు వినయ్.

"అయినా మీ తోడికోడళ్లు ఇద్దరూ అమ్మకు ఇంత ముద్ద పెట్టడానికి వంతులు వేసుకోకుండా ఆవిడని కళ్లల్లో పెట్టుకుని చూసుకుని ఉంటే గౌరి అవసరమే వచ్చేది కాదు, ఇప్పుడు పరిస్థితి ఇంతదాకా రాదు కదా!" సురేఖ చేసిన తప్పు ఎత్తి చూపాడు వినయ్.

తను ఎంత తప్పు చేశానో తెలిసిందానిలా మౌనంగా తల దించుకుంది సురేఖ.

"నిజానికి అమ్మ గౌరి పెళ్లి చేయాలంటే మమ్మల్ని అడగాల్సిన అవసరం కూడా లేదు. తను ఉంటున్న ఇల్లు అమ్మేసి ఆ డబ్బుతో పెళ్లి చేసేది. కానీ ఆ ఇల్లు ఎప్పుడో మన కూతురు పేరున రాసేసిందట, దాని పెళ్లప్పుడు కట్నం కింద పనికి వస్తుందని" తన తల్లి ఔదార్యాన్ని అర్థం చేసుకోమన్నట్లు తెలియచెప్పాడు వినయ్.

"ఇల్లు మనమ్మాయి పేరున రాసేస్తే మీ అమ్మగారు రేపటి నుండి ఎక్కడ ఉంటుందండీ?" ఇంకా ఎక్కడో అనుమానం మిగిలి ఉండగా అడిగింది సురేఖ.

"ఆమె, నీ కూతురికి ఆస్తి రాసింది కదా అని నీ ఇంటికి ఏమి రాదులే, భయపడకు. అమ్మ బతికున్నంత కాలం తన దగ్గరే ఉంచుకుంటానని గౌరీ తన భర్తను ఒప్పించిందట. అతను కూడా చాలా మంచివాడిలా ఉన్నాడు. అడిగిన వెంటనే ఒప్పుకున్నాడట. గౌరికి అమ్మ మీద ఉన్న ప్రేమ ముందు కన్న కొడుకులం మేమిద్దరం తల దొచుకోవాల్సి వచ్చింది. అందుకనే గౌరిని దేవుడు ఇచ్చిన చెల్లిగా భావించి, పెళ్లిఖర్చులు మేమిద్దరం పెట్టుకోవడానికి ఒప్పుకున్నాం, కాస్తన్నా మేం చేసిన తప్పు సరిదిద్దుకున్నవాళ్లం అవుతామని" వివరంగా తెలియచెప్పాడు వినయ్.

అప్పటికిగానీ తాను అత్తగారి పట్ల ఎంత నిర్దయగా ప్రవర్తించిందో అర్థం కాలేదు సురేఖకు. "ఏమండీ, నన్ను క్షమించండి. అత్తయ్య పట్ల నేను ఎంత పెద్ద తప్పు చేశానో ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది. గౌరికి దగ్గరుండి మనమే కన్యాదానం చేద్దాం. అప్పుడైనా నేను చేసిన తప్పును భగవంతుడు క్షమిస్తాడేమో!" అంటూ కళ్లనీళ్ల పెట్టుకుంది సురేఖ.

నిజానికి తన తల్లి కోరుకుంది కూడా అదే. కానీ సురేఖ ఏమంటుందో ఏమోనని తల్లికి మాట ఇవ్వలేకపోయాడు, ఇంత త్వరగా సురేఖలో మార్పు వస్తుందని ఊహించని వినయ్.

"అంతకన్నా ఏం కావాలి సురేఖా? నువ్వు చెప్పినట్లే చేద్దాం. గౌరికి మనమిద్దరం ఇకమీదట అండగా నిలబడదాం. అమ్మ కూడా సంతోషిస్తుంది" అంటూ తన తల్లికి ఆ విషయం చెప్పడానికి ఉపక్రమించాడు వినయ్.


## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

**sunmagvaartha@gmail.com**

# అంబులెన్స్

అది ఒక ప్రధాన రహదారి. ఓ రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకడు తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోయి పడి ఉన్నాడు. చుట్టూ జనం మూగారు. వారిలో ఒకరు పెద్ద పెద్దగా అరుస్తున్నారు "అంబులెన్స్‌కి ఫోన్ చేయండి" అంటూ.

వెంటనే ఒకరు ఫోన్ చేశారు. కాసేపటికి అంబులెన్స్ వచ్చింది. గాయపడిన వ్యక్తిని అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. ఆయనకు అత్యవసర చికిత్స చేశారు. ఆయన బతికాడు.

అంబులెన్స్ అనేది లేకుంటే ఆయనను క్షణాల్లో ఆస్పత్రికి తరలించడం సాధ్యమయ్యేదా అని ఒకరికొకరు అనుకున్నారు. ఆపదలో ఉన్న వ్యక్తి సాయపడే మిత్రుడు లాంటిది అంబులెన్స్.

ఆ కాలంలో యుద్ధాలు అధికం. అలాగే యుద్ధాలలో గాయపడినవారి సంఖ్య కూడా అధికమే. గాయపడిన వారిని అత్యవసరంగా వైద్యుడి దగ్గరకు తీసుకుపోవాలి.

అప్పుడేం చేసేవారంటే– ఓ ముతక బట్టను ఉయ్యాలలా చేసేవారు. పిల్లలను పడుకోపెట్టడానికి ఉయ్యాల చేస్తాం కదా! అలాంటిది తయారు చేస్తారు.

ఆ ఊయలలో గాయపడిన వారిని పడుకోబెట్టేవారు. అనంతరం అతనిని ఎత్తుకుని వైద్యుడి వద్దకు తీసుకుపోయే వారు. ఆ తర్వాత వైద్యచికిత్స చేసేవారు. అయితే ఇందులో ఉన్న సమస్య ఏమిటంటే క్షతగాత్రులను త్వరత్వరగా తీసుకుపోవడం అన్నది ఇబ్బందిగా ఉండేది. ఆలోచిస్తే అది నిజంగా కష్టసాధ్యమే. అందువల్ల సగం మంది మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయేవారు. కాస్తంత త్వరగా వారిని తీసుకుపోవడానికి ఏమిటి దారి? అని ఆలోచించారు. గుర్రం మీద ఎక్కించుకుని పోతేనేం..? అని ఒకరు సలహా ఇచ్చారు.

అదేదో బాగుందనుకుని అలాగే చేసి చూశారు. కానీ అది మరింత ప్రమాదకరంగా మారింది. గుర్రం పరుగెత్తే వేగానికి, కుదుపుకీ గాయపడిన వ్యక్తి నానా అవస్థ పడేవాడు. అలాగని నెమ్మదిగా తీసుకుపోదామంటే ప్రాణాపాయం కలిగేది. కనుక ఇది కూడా లాభం లేదనుకున్నారు.

మళ్లీ ఆలోచనలో పడ్డారు.

సరే, గుర్రం వీపు మీద కాకుండా గుర్రబ్బండిలో తీసుకుపోతేనేం అనుకున్నారు. నాలుగు చక్రాలు ఉన్న గుర్రబ్బండిని ఉపయోగంలోకి తీసుకువచ్చారు. 1487వ సంవత్సరంలో ఇది వాడుకలోకి వచ్చింది. ఇది కాస్తంత సౌకర్యవంతంగానే అనిపించింది. అందువల్ల 1792 వరకూ ఇదే పద్ధతిని పాటించారు.



ఓ ఫ్రెంచ్ వైద్యుడు.. ఆయన పేరు బేరన్ డొమినిక్ జీన్ లారే(1766 జులై 8వ తేదీన పుట్టిన ఈయన 1842 మే 25వ తేదీన అనారోగ్యంతో మరణించారు). ఈయన ఆర్మీ సర్జన్. ఆయనేం చేసారంటే– గుర్రబ్బండిలోనే ఓ పక్క లాంటిది ఏర్పాటు చేసారు. ప్రథమ చికిత్స అంతా బండిలోనే చేసేవారు.

ఎక్కడైనా ఒకరు గాయపడినట్లు తెలిస్తే అక్కడికి వెళ్లి అవసరమైన చికిత్స చేసేవారు. ఆయన తనతో కలిసొచ్చే కొందరు సహాయకులను సంఘటనా స్థలానికి తీసుకుపోయేవారు. వారి సహాయం తీసుకునేవారు.

1864లో జెనీవా ఒడంబడిక జరిగింది కదా. అప్పుడే అంబులెన్స్ సర్వీసుకి మోటారు వాహనాలను ఉపయోగించవచ్చని నిర్ణయించారు.

ఆ సమయంలో ఇంకొక రకమైన అంబులెన్స్ సేవ కూడా అమలులోకొచ్చింది. భారీ బెలూన్లు ఉండేవి కదా. వాటిని అంబులెన్సులుగా ఉపయోగించేవారు. మొదటిసారి అమెరికాలో 1930లో ఓ పూర్తి స్థాయి అంబులెన్స్ వాహనం వాడుకలోకి వచ్చింది. అదేమిటంటే– అందులో ఆక్సిజన్ సిలిండర్ ఉంటుంది. డ్రిప్స్ వంటి అత్యవసర ఉపకరణాలు కూడా ఉండేవి. అలాగే ఓ వైద్యుడు తప్పనిసరిగా ఉంటాడు. ఓ నర్సు సరేసరి. ఇటువంటి అంబులెన్స్ సౌకర్యం వచ్చిన తర్వాతే పలువురు క్షతగాత్రులను కాపాడటం సాధ్యమైంది.

ఇప్పుడు ఈ అంబులెన్స్ విధానంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఊహించనంత పురోగతి చోటు చేసుకుంది. మోటారు వాహనమే కాదు, నౌక, హెలికాప్టర్, విమానాలు.. వంటివి కూడా క్షతగాత్రుల ప్రాణాలు కాపాడటానికి ఉపయోగిస్తున్నారు.

ప్రమాదంలో ఉన్న వ్యక్తిని చూసినప్పుడు వెంటనే అతనిని కాపాడాలనే ఆలోచన సాటి మనిషికి రావడం అత్యంత సహజం. అందుకే కాలం కాస్తంగా సక్రమంగా నడుస్తోంది. గాయంతో పడిపోయిన వ్యక్తిని చూడటంతోనే మనకు తెలియకుండానే పరుగెడతాం. అంబులెన్సుకి ఫోన్ చేస్తాం. అంబులెన్స్ రాగానే అందులో అతనిని ఆస్పత్రికి తరలిస్తాం. ప్రాణాలు కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

సరే.. అదలా ఉండనిద్దాం.

అనగనగా ఒక వ్యక్తి వున్నాడు. రోడ్డు మీద ఒకడు గాయాలతో పడి ఉండ టాన్ని చూశాడు. అతనిని చూడటంతోనే ఆ ఒక్కడూ పరుగెత్తాడు. కాస్సేపటికి మరొకడిని పిల్చుకుని వచ్చాడు.

"ఎవరది.. నీకు తెలిసిన డాక్టరా?" అని ఒకడు అడిగాడు.

"అబ్బే.. లేదండి. అతను నా తమ్ముడు. ఆక్సిడెంట్ అంటే ఎలా ఉంటుంది? అని చాలా రోజులుగా అడుగుతున్నాడు. ప్రత్యక్షంగా చూడాలని వాడి ఆశ. అందుకే వాడిని పిల్చుకొచ్చాను" అన్నాడు.

**- యామిజాల జగదీశ్**

# సమస్యను బట్టి పరిష్కారం

సుబ్బారావు ఆలోచించాడు. అతనితో వచ్చిన కుర్రాడు అయిదులో రాహువు అనేసరికి అప్పటివరకూ తాగుతున్న టీ కాస్తా అదోలా అనిపించి కప్పు టేబిల్ మీద పెట్టేసి జాలిగా మొహం పెట్టాడు.

"సార్, చిన్నప్పటి నుండీ నేను గమనించిన జీవిత సత్యం ఒకటి చెబుతాను, మరేమీ అనుకోకండి"

"అనుకునేందుకేమీ లేదు" అన్నాను.

"ఏమీ లేదులే.. లోకం బాధలో ఉన్నవాడినే ఎక్కువగా బాధ పెట్టింది. మా ఆవిడ నానా ఇబ్బందులూ పెడుతుంటే కొత్తగా ఇలా అయిదులో రాహువు అంటే నేనేమైపోవాలి మాస్టారూ?"

సుబ్బారావుతో పాటు నేను కూడా హాయిగా నవ్వుకున్నాం.

'సుడిలో దూకి ఎదురీదాకా మునకే సుఖమనుకోవోయ్' అన్నది దేవదాసు ప్రేమ వ్యవహారంలో చెప్పినా ఇప్పుడది పెళ్లి వ్యవహారంలో చెలామణి చేసుకోవాలి" అనేసాడు సుబ్బారావు.

"ఇంతకీ నన్నేం చెయ్యమన్నారు?" కుర్రాడు అడిగాడు.

"ముందర పరిస్థితిని అర్థం చేసుకోండి. జాతకాలలోని గ్రహ స్థితిని అనుసరించి సమస్య ఎక్కడ ఉన్నది అన్నది వ్యావహారికంగా పరిశీలించి చక్కని దారిని సూచించటం జ్యోతిష శాస్త్రం అవుతుంది".

"ఊ.. అంటే అయిదులో రాహువు సమస్య.. మరి సమాధానం?"

"ఈ తొందరే వద్దు శిశువా! రాహువంటేనే తొందర, దూకుడు. అక్కడి నుండి ఆవేదన. ఆ తరువాత ఆందోళన. ఆ తరువాత..."

"సుడిగుండం"

"కరెక్ట్. అయితే తొందరొద్దు. యువతరం ఈ రోజు అంతర్జాలంలోంచి సేకరించిందంతా విజ్ఞానం అనుకుంటోంది"

"కాదా?"

"కాదు. అక్కడుండేది సమాచారం మాత్రమే. ఆ కొద్ది సమాచారాన్నీ గట్టిగా పట్టుకుని అన్ని విషయాలలో ఏదో ఒక నిర్ధారణకి వచ్చేసి దానినే పట్టుకుని వాదించటం, పోట్లాడటం అనేది ఒక మానసికపరమైన జబ్బు".

"ఛా.."

"దీనిని శాస్త్రవేత్తలు మానియా అంటారు".

సుబ్బారావు అందుకున్నాడు. "సార్, ఇలాంటివి చాలా మానియాలు ఉన్నాయి కదూ?"

"కావలసినన్ని. ముఖ్యంగా ఇప్పుడు నేను చెప్పిన మానియా క్రమేణా అందరి మీద, అన్నిటి మీదా కంట్రోల్ తెచ్చేసుకోవాలనిపించే ఒక ఒరవడిలోకి దింపుతుంది. దానినే ప్రత్యేకంగా మెగలోమానియా అంటారు".

'మెగలోమానియా'

"కరెక్ట్. ఈ చిత్రమైన సమాచార యుగంలో చాలా మంది తెలియకుండానే ఈ వ్యాధితో బాధపడుతున్నారు. మీరు ఫలానా వ్యక్తి చాలా గొప్పవాడు, మంచివాడు అన్నారనుకోండి, వెంటనే నేను ఇంకో చోట చూపాను. వాడంత దుర్మార్గుడు ఎవరూ లేరు అంటారు. ఏది చెప్పినా దానిని ఖండించి మాట్లాడటం ఒక మానసికపరమైన జబ్బు. డాక్టర్‌ను కలవటం వలన ఉపయోగం ఉంటుంది".

సుబ్బారావు గింజుకున్నాడు.

"సార్, ఇది భారతదేశం"

"కరెక్ట్"

"ఇక్కడ సైకియాట్రిస్ట్ అని బోర్డున్న చో నిలబడితేనే అదోలా అనుకుని చీదరించుకునే జనం"

"దౌర్భాగ్యం అది. వాస్తవానికి అలా చీదరించుకునే ప్రతివాడికి కూడా ఏదో ఒక జబ్బు ఉంటుంది. వారు చెలామణి అయ్యారు, వీరు కాలేదు. అంతే తేడా!"

కుర్రాడు టీ తాగేసాడు.

**"సార్, ఇది భారతదేశం"**

**"కరెక్ట్"**

**"ఇక్కడ సైకియాట్రిస్ట్ అని బోర్డున్న చోట నిలబడితేనే అదోలా అనుకుని చీదరించుకునే జనం"**

"మీరు ఏదైనా చెప్పండి సార్, నేను ఈమెను పొరపాటుగా కూడా డాక్టర్ దగ్గరకు తీసుకుని వెళ్లలేను. కుంభమేళాకి నెలకొకసారి వెళ్లి రమ్మన్నా వెళ్లి రాగలను. ఈ పని మటుకు చెయ్యలేను. సారీ!"

"తొందర పడకు. వైద్యం చేయించినంత మాత్రాన నువ్వు చెప్పిన మాట వినేస్తుందనుకోకు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు అని నువ్వంటే కాదు, ఏ దిక్కులో అయితే సూర్యుడు ఉదయిస్తాడో ఆ దిక్కును సూర్యుడు అంటాం అని సవరించే వారిని నువ్వు అంత తేలిగ్గా తీసుకోలేవు".

"ఇందాక మరో మాట అన్నారు"

"రెండు మూడన్నాను"

"ఊ... గ్రహ స్థితిని గమనించి మార్గం చెప్పేది శాస్త్రం అన్నారు"

"వ్యావహారికంగా"

"అవును. అదేదో చెప్పవచ్చుగా, మరో కప్పు టీ చెబుతాను"

సుబ్బారావు చిరునవ్వు చిందించాడు.

"నువ్వు మంచివాడివి"

"చాలా"

"తెలివిగలవాడివి"

"కొద్దిగా"

"ఊ... అయితే విను. వ్యవహారాన్ని వ్యవహారంతోనే గిల్లాలి. అమ్మాయి ఏదేదో చెబుతుంటే ముఖ కవళికలు ద్వారా స్పందించటం నేర్చుకో"

"ఎవరి దగ్గర?"

"సుబ్బారావు దగ్గర" అతను ఉలిక్కిపడ్డాడు.

"అదుగో.. ఈ స్పందనలు చాలా అవసరం. ముఖ కవళికలు ఎలా ఉండాలంటే ఇదిగో ఇప్పటివరకు బాగుంది, ఆ తరువాత నుండి లాజికల్‌లా లేదన్నట్లుండాలి".

"అర్థమవుతోంది" "పొరపాటుగా కూడా వాదనలోకి వెళ్లవద్దు"

"ఒక్కమాట అంటే చెప్పుతో కొట్టండి"

"ఆంగ్లంలోనూ, తెలుగులోనూ కొన్ని క్లాసికల్ పుస్తకాలు తెచ్చి అల్మారాలో పెట్టి ఒక్కొక్కటీ చదువుతూ ఉండు"

(మిగతా 27వ పేజీలో..)

# ప్రపంచ వింత 'చైనా మహాకుడ్యం'

షేక్ అబ్దుల్ వాహీం జాని



**మానవ నిర్మిత మహాద్భుతాలలో ఒకటి ప్రపంచ ప్రసిద్ధి చెందిన కట్టడం చైనా గోడ. ఆధునిక ప్రపంచ వింతల్లో ఇది ఒకటి. మనం ఇంటి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించుకున్నట్లు చైనావారు తమ దేశం చుట్టూ రక్షణ కోసం బలమైన మహా కుడ్యాన్ని నిర్మించుకున్నారు.**

క్రీ.పూ.220లో మంగోలియన్ల, మంచూరియన్ల దండయాత్రలు చైనాకు తలనొప్పిగా మారింది. వారి దాడిని నివారించేందుకు, వారు చైనాలోకి చొరబడకుండా ఉండేందుకు తమ దేశం చుట్టూ మహాకుడ్యం నిర్మించారు. ఈ మహాకుడ్య శిఖరాగ్రాన ఒక మిలియన్ సైనికులు కాపలా కాసేవారట. విహంగ వీక్షణం చేస్తే ఒక బలమైన రాతిసర్పంలా చైనా మహాకుడ్యం కనిపిస్తుంది.

## దేశ రక్షణ కోసం మహాకుడ్యం

అనాదిగా మంగోలియన్లు, మంచూరియన్లు చేస్తున్న ఈ దండయాత్రల సమస్యకు పరిష్కారం కోసం ఒక మహాకుడ్యాన్ని తమ దేశం చుట్టూ నిర్మించాలని అప్పటి పాలకులు భావించారు. గ్రేట్ వాల్ ఆఫ్ చైనా ప్రపంచంలోకెల్లా పొడవైన గోడ. క్రీ.పూ.220 నుండి క్రీ.శ. 16వ శతాబ్దం వరకు దాదాపు కొన్ని వేల సంవత్సరాల పాటు అనేకమంది చైనా చక్రవర్తుల పాలనా కాలంలో దీని నిర్మాణం కొనసాగింది.

భారతదేశానికి ప్రపంచంలోని అద్భుతాలలో ఒకటైన తాజ్‌మహల్ ఉంటే, చైనాకు కూడా ప్రపంచంలోని మరో అద్భుతం ది గ్రేట్ వాల్ ఆఫ్ చైనా ఉంది. ఒకప్పుడు దీనిని పర్పుల్ ఫ్రాంటియర్, ఎర్త్ డ్రాగన్ అని పిలిచేవారు. ప్రస్తుతం దీనిని ది గ్రేట్ వాల్ ఆఫ్ చైనా అని పిలుస్తున్నారు. గ్రేట్ వాల్ ఆఫ్ చైనా 19వ శతాబ్దం చివరి నుండి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ మహాకుడ్యం గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. దీనికి సంబంధించిన అనేక అపోహలు కూడా ప్రాచుర్యం పొందాయి. చైనా చరిత్ర ప్రకారం క్రీ.పూ.1046 నుండి 771 మధ్య కాలంలో చైనాను పరిపాలించిన వెస్ట్రన్ జౌ రాజవంశంవారి కాలంలో చైనాగోడ నిర్మాణం జరిగిందని తెలుస్తుంది.అయితే ఏ రాజు కాలంలో దీని నిర్మాణం ప్రారంభమైందనడానికి రుజువులు లేవు. కింగ్ యు ఆఫ్ జౌ క్రీ.పూ.795-771 కాలంలో కొంతమేరకు గోడ, అక్కడక్కడ టవర్లు కూడా నిర్మించినట్లు చైనా చరిత్ర చెబుతోంది. క్రీ.పూ.689-675 మధ్య కాలంలో పరిపాలించిన కింగ్ వెన్ ఆఫ్ చు దేశాన్ని శత్రువుల బారి నుండి రక్షించుకోవడానికి గోడను నిర్మించాలని భావించారు. తరువాత అనేక రాష్ట్రాలు తమ సొంత గోడను నిర్మించుకున్నాయి. 'క్విన్ షీ హువాంగ్' చక్రవర్తి క్రీ.పూ.259-210 కాలంలో చైనాను పాలించారు. ఇతని కాలంలో చైనా మొత్తాన్ని ఏకం చేసి చరిత్ర ప్రసిద్ధి చెందాడు. పలు రాష్ట్రాలవారు నిర్మించిన గోడను కలుపుతూ ఎంతో సహకారాన్ని అందించి గ్రేట్ వాల్ ఏర్పడటానికి శ్రీకారం చుట్టారు. ఆయన పాలనా కాలంలో తొలిసారిగా చైనాగోడ నిర్మాణం వేగం పుంజుకుందని తెలుస్తుంది.

## మహాకుడ్యం విశేషాలు

మహాకుడ్యం పొడవు విషయంలో అనేక అపోహలు ఉన్నాయి. క్రీ.శ.2012 సంవత్సరం చైనా ప్రభుత్వం దీని పొడవు, వెడల్పులు ఎంత అనేది తెలియజేయాలని ఒక బృందాన్ని నియమించింది.

ఈ గోడ చైనాకు పశ్చిమం నుండి తూర్పు వరకు 21,196 వేల కి.మీ. అని ఆ బృందం నిర్ణయించింది. అంటే భూమధ్య రేఖలో సగం అన్నమాట. మధ్య మధ్యలో సైనికులు పహారా కాయడానికి, ఎండ, వానలకు తల దాచుకోవడానికి టవర్లు నిర్మించారు. ఈ గోడలో సైనికులు పహారా కాసేందుకు దాదాపు 25 వేల వాచ్ టవర్లు నిర్మించారని అంచనా. అతి పెద్ద గదిలా ఉండే ఈ వాచ్ టవర్‌కు నలువైపులా గాలి, వెలుతురు రావడానికి కిటికీలు ఉన్నాయి. ఆ కిటికీల ద్వారా శత్రువుల రాకను సైతం సైనికులు గమనించేవారు.





సైన్యపు అవసరాలైన తపాలా, వార్తా సంకేతాల కోసం మహాకుడ్యంలో అనేకచోట్ల సైనికులు పహారా కాసేందుకు నిర్మించిన బురుజులు అప్పట్లో చాలా ఉపయోగపడ్డాయి.

శత్రువుల కదలికలను గుర్తించడానికి, సైగల ద్వారా సందేశాలను పంపడానికి ఈ బురుజులు, టవర్లు చాలా ముఖ్యమైనవని నిరూపితమైనాయి.

కొన్ని చోట్ల ఈ గోడ 30 అడుగుల వెడల్పు, గరిష్ట ఎత్తు 12 అడుగులు. అదే సమయంలోని దీని టవర్ 26 అడుగుల ఎత్తుతో నిర్మించారు. మరికొన్ని చోట్ల ఈ గోడ 25.6 అడుగుల ఎత్తుతోనూ, 16.4 అడుగుల వెడల్పుతోనూ కట్టారు. కొన్నిచోట్ల అయిదుగురు వ్యక్తులు, మరికొన్నిచోట్ల పది మంది వ్యక్తులు చైనా గోడపై పక్క పక్కన నడిచేంత వెడల్పుగా ఉంటుంది. 1987లో విలియం లిండ్సే అనే సుదూర బ్రిటిష్ రన్నర్ 1500 మైళ్ల పొడవైన చైనా గోడను కాలినడకన పూర్తి చేశాడు. గ్రేట్ వాల్ ఆఫ్ చైనా నిర్మాణ సమయంలోనే చైనా ప్రజలు చక్రం మోసే వాహనాన్ని కనుగొన్నారని కూడా అంటారు. దీనిని 'వీల్‌బారో' అంటారు. నిర్మాణ సమయంలో కూడా ఇది బాగా ప్రాచుర్యం పొందింది. గోడ మీద ఆధిపత్యం కోసం శతాబ్దాలుగా వేలాది యుద్ధాలు జరిగాయి. అనేక రాజవంశాలతో పాటు సామ్రాజ్యాల మధ్య యుద్ధాలు జరిగాయి. ప్రపంచంలోనే ఎత్తైయిన గోడతో పాటు దీనిని 'ప్రపంచంలోనే ఎత్తైన శ్మశానవాటిక' అని కూడా అంటారు. గోడ నిర్మాణ సమయంలో లక్షలాది మంది మరణించారు. వారిలో చాలా మందిని గోడ కింద ఖననం చేశారు. దీంతో ప్రపంచంలోనే ఎత్తైన శ్మశానవాటికగా పిలుస్తున్నారు.

## ఆధునిక ప్రపంచ వింత

ఆ కాలంలోనే దీన్ని ఎలా నిర్మించారనేది ఆశ్చర్యం కలుగుతుంది. మధ్య యుగంలోని ఏడు వింతల్లో ఒకటి చైనా గోడ. ఇందులోనే కలిపి ఉన్న మింగ్ గ్రేట్ వాల్ పొడవు 8,857 కి.మీ. అప్పటి వరకు ముక్కలు ముక్కలుగా ఉన్న చైనా గోడను మింగ్ రాజవంశీయుల కాలంలో అనుసంధానం చేసి ఒకే గోడలా నిర్మించారు. అందువల్ల ఈ భాగానికి మింగ్ గ్రేట్‌వాల్ అనే సార్థక నామం ఏర్పడింది. ఆ తరవాత హాన్ రాజవంశానికి చెందిన లియు చే క్రీ.పూ.156 నుండి 87 వరకు పాలించారు. ఈయన పాలనా కాలంలో చైనాగోడ పునరుద్ధరించారు. అనంతరం క్రీ.శ.1328 నుండి 1398 మధ్య కాలంలో పాలించిన మింగ్ రాజవంశ చక్రవర్తుల కాలంలో దాదాపు 10 వేల కి.మీ. మేర ఈ గోడ నిర్మాణం జరిగింది. ఈ కార్యక్రమంలో మిగ్ వంశ చక్రవర్తి హాంగ్వు పాత్ర ప్రధానమైనది. అనంతరం ఇతని వారసులు 130 సంవత్సరాల పాటు చైనా గోడ నిర్మాణం కొనసాగించారు. తొలి ఇటుక పడిన నాటి నుండి నేటి వరకు చైనా గోడ చరిత్రను పరిశీలిస్తే 2000 నుండి 2500 సంవత్సరాల పైచిలుకు చరిత్రను ఇది కలిగి ఉందని తెలుస్తుంది. అమెరికన్ వార్తా పత్రికలు త్వరలో చైనా గోడ కూల్చివేసి దాని స్థానంలో హైవే నిర్మిస్తున్నారని 1899లో ప్రచురించి పుకారును వ్యాప్తి చేసింది. ఎవరూ దేనిని కూల్చివేయలేదు. అంతేకాకుండా 1984లో మహాకుడ్యం పునరుద్ధరణ కోసం ఒక కార్యక్రమాన్ని డెంగ్ జియావోపింగ్ చొరవతో, మావో త్సే తుంగ్ నాయకత్వంలో ప్రారంభించి అనేకచోట్ల మరమ్మత్తు చేయించారు. కొన్ని చోట్ల కాలగతిన పూర్తిగా ధ్వంసమైన చైనా గోడను పునర్నిర్మించారు.

## దృఢమైన నిర్మాణం

చైనా మహాకుడ్యం దృఢమైన నిర్మాణం. ఇటుకలు ఉపయోగించక ముందు వీటి నిర్మాణంలో 'తైపా మట్టి', రాళ్లు, కలపను ఉపయోగించారు. మింగ్ వంశస్థుల కాలంలో వీటి నిర్మాణానికి ఇటుకలను విరివిగా ఉపయోగించారు. ఇటుకలు, టైల్స్, సున్నం, రాళ్ల ఉపయోగించారు. ఇటుకల ఉపయోగం నిర్మాణంలో వేగాన్ని పెంచింది. రాళ్ల స్థానంలో ఇటుకల ఉపయోగం చాలా సులువైంది. మట్టి కంటే ఇటుకలు ఎక్కువ బరువును మోస్తాయి, ఇటుకల కంటే రాళ్ల నిర్మాణం ఎక్కువ దృఢత్వాన్ని కలిగి ఉంటుంది. కానీ రాళ్లతో నిర్మాణం అనేది అంత సులువైన విషయం కాదు. అందుకే చాలా చోట్ల



ఇటుకలను ఎక్కువగా ఉపయోగించారు. రాళ్లను పునాదుల కోసం, ఇటుకలను గోడల నిర్మాణానికి ఉపయోగించారు.

బీజింగ్ ఉత్తర ప్రాంతానికి చెందిన మహాకుడ్యం మరమ్మత్తులు పునర్నిర్మాణాలకు నోచుకొని, పర్యాటకుల కేంద్రంగా విరాజిల్లుతున్నది. ఇతర ప్రాంతాలు కుడ్య శిథిలాలను గ్రామ ఆటస్థలాలలోను, వీటి ఇటుకలు, రాళ్లను పల్లెవాసులు ఇండ్ల కట్టడాలలో ఉపయోగించి దురుపయోగం చేస్తున్నట్లు కనుగొని వాటిని అరికట్టారు.

మహాకుడ్యానికి సంబంధించి సరైన సర్వేలు చేపట్టకపోవడం విచారకరం. మరీముఖ్యంగా లోపలి ప్రాంతాలలో దీనిపై సరైన నిఘా లేకపోవడం విచారకరమని కొందరి అభిప్రాయం. ఇదే కొనసాగితే రాబోయే 20 సంవత్సరాలలో 'గాన్సూ' రాష్ట్రంలోని ఈ కుడ్యభాగం 60 కి.మీ. కంటే ఎక్కువ భాగం అంతరించిపోయే ప్రమాదముంది.

దీనికి కారణాలు దుమ్ము తుఫానులు, ఇసుక తుఫానులు. ఈ ప్రాంతాలలో దీని ఎత్తు 5 మీటర్ల నుండి 2 మీటర్లకు కుదించుకుపోయింది. పలుచోట్ల మహాకుడ్యం తన ఆకృతి, ఆకర్షణను కోల్పోతోంది.

చంద్రునిపై నుండి చైనా మహాకుడ్యం కనిపిస్తుందనే వాద ప్రతివాదాలున్నాయి. కనపడదని ఎక్కువ మంది తేల్చి చెప్పారు. అయితే భూమి నుండి 100 మైళ్ల దూరాన గల భూ కక్ష్య నుండి మహాకుడ్యం కనిపిస్తుందని కొందరి అభిప్రాయం. వ్యోమగామి విలియమ్ పోగ్ అనే వ్యక్తి స్కైలాబ్ నుండి చూడడానికి ప్రయత్నించారు. చైనా మహాకుడ్యం కనబడలేదని తేల్చి చెప్పారు. ఎలాంటి పరికరాన్ని ఉపయోగించకుండా దీనిని చూడడం సాధ్యం కాదనీ, అయితే బైనాక్యులర్‌తో చూడగలిగానని ప్రకటించాడు. ఇలా చూసిన వారంతా నూలు దారంలా, రేఖా మాత్రంగానే చైనా మహాకుడ్యం కనిపించిందని చెప్పారు. నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ అపోలో 11 నుండి వీక్షిస్తూ "భూమిపై గల మానవ నిర్మిత వస్తువులను నేను వీక్షించలేకపోతున్నాను, చైనా మహాకుడ్యాన్ని కూడా చూడలేకపోయాను. అది ఇక్కడి నుండి కనబడుట లేదు" అని ప్రకటించారు.



## పర్యాటకుల సందడి

మహాకుడ్యం సమీపంలో చైనా రాజవంశీయుల దుస్తులు వేసి ఫొటోలు తీస్తుంటారు. ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన జంటలు ఈ దుస్తులు ధరించి ఛాయాచిత్రాలు తీయించుకుని ఆనందిస్తుంటారు. మానవ నిర్మిత ప్రపంచ వింత చైనా మహాకుడ్యం వద్ద కూడా ఫొటోలు, వీడియోలు తీసుకోవచ్చు. వీటికి తగిన రుసుము చెల్లించవలసి ఉంటుంది. చైనా మహాకుడ్యాన్ని దర్శించిన వారికి సర్టిఫికెట్‌లతో పాటు ఛాయా చిత్రాలు కూడా ఇస్తారు. కేబుల్ కార్లలో ప్రయాణిస్తూ కూడా చైనాగోడను విహంగ వీక్షణం చేయవచ్చు. 1987లో దీనిని యునెస్కోవారు ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించారు.

ఈ కుడ్యానికి చెందిన బీజింగ్ ఉత్తర ప్రాంతం మరమ్మత్తులు, పునర్నిర్మాణాలకు నోచుకొని, పర్యాటకుల కేంద్రంగా విరాజిల్లుతున్నది. ■

**(24వ పేజీ తరువాయి)**

# సమస్యను బట్టి పరిష్కారం...

"నటించు. అమ్మాయి ఆ అట్టలు అటూ ఇటూ తిరగేసి ఏదో మాట్లాడుతుంది".

"కచ్చితంగా"

"విన్నట్లు విను. ఆలోచించినట్లు నటించు. చిరునవ్వు నవ్వి మరల పుస్తకంలోకి వెళ్లిపో. రోజులు గడుస్తున్నకొద్దీ మార్పును నువ్వే గమనిస్తావు?"

కుర్రాడు ఆలోచించాడు. మొత్తానికి తెలివిగలవాడే.

"సార్.. ఈ రాహువు వ్యవహారం ఇంకాస్త చెబుతారా?"

"అమ్మాయి తిండి అలవాట్లు వింతగా ఉంటాయి. ఒక్కోసారి అన్నీ తినకుండా ఎన్నో రోజులుండగలదు. ఎటూ కాని వేళ నిద్ర పోవటం, సర్వసాధారణంగా దేనికైనా అందరూ ఇచ్చే సమాధానాలు ఇవ్వకపోవటం, అప్పుడప్పుడు నిద్రలో మాట్లాడటం జరుగుతూ ఉంటాయి. అవునా?"

"అవును. చివరిది చెప్పలేను. నేను పడుకుని గురక పెడితే నన్ను అందరూ గ్రీకువీరుడిలా గురక వీరుడంటారు".

"ఒకే. జ్యోతిషంలో లౌకికం, అలౌకికం, తాత్వికం- మూడూ ఉంటాయి. వ్యావహారికంగా దీనికి సమాధానం పొందే సులువైన మార్గం చెప్పాను. సాయంసంధ్యలో చీకటి పడే ముందు దీపారాధన అనివార్యంగా చెయ్యటం దైవికమైన పద్ధతి".

"ఇంకోటి"

"సంగీతం శరీరంలోని చక్రాల మీద పని చేసి సహాయపడుతుంది. మాయా మాళవ గేళ అనే రాగాన్ని రాత్రి పడుకునే ముందర వినాలి. మార్పు ప్రస్ఫుటంగా పనికొస్తుంది".

**- వేదాంతం శ్రీపతిశర్మ**



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బారాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



వృత్తి వ్యాపారాల్లో వున్నవారికి బాగుంటుంది. కొత్త విషయాలు తెలుసుకుంటారు. పాత రుణాలు తీరుస్తారు. విద్యార్థులకు బాగుంటుంది. ఉద్యోగులకు ఆర్థికంగా బాగుంటుంది. చిరు వ్యాపారులకు సమస్యలుంటాయి. కోర్టు విషయాలు సానుకూలం. అనుకున్న పనులు సకాలంలో పూర్తి చేస్తారు. అదనపు ఆదాయ మార్గాలకై అన్వేషిస్తారు.

## వృషభం



ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. అకారణంగా మానసిక ఆందోళన చెందుతారు. కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారులు అధిక రుణాలు చేయాల్సి వస్తుంది. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. ఉద్యోగులకు స్థానచలనం.

## మిథునం



వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది. ముఖ్యమైన నిర్ణయాల్లో ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. ధర్మ రక్షణకై పాటుపడతారు. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. ఉద్యోగులకు ఉన్నత పదవి లభిస్తుంది. వృథా ఖర్చులుంటాయి. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయులను కలుసుకుంటారు.

## కర్కాటకం



స్త్రీల వల్ల సమస్యలు ఉంటాయి. వివాదాలకు దూరంగా వుంటే మంచిది. వ్యాపారులకు యథాతథంగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత ఏర్పడుతుంది. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది. శుభ యోగం.

## సింహం



ఆర్థికంగా బాగుంటుంది. వ్యాపారులకు సమస్యలు అధికం. కోర్టు వ్యవహారాలు సానుకూలం. రుణాలు తీర్చడంలో ఇబ్బందులు ఉంటాయి. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక సమస్య పరిష్కారమవుతాయి. దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. ఉద్యోగ ప్రయత్నం ఫలిస్తుంది. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు.

## కన్య



కోర్టు వ్యవహారాలు సానుకూలం. క్రయ-విక్రయాలు బాగుంటాయి. సాహస యాత్రలు చేస్తారు. రుణాలు తీర్చడంలో ఇబ్బందులుంటాయి. ఉద్యోగంలో ఒడుదుడుకులు ఉంటాయి. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి వస్తుంది. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి.

## తుల



వృత్తి వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది. నూతన విషయాలు తెలుసుకుంటారు. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. వివాదాలకు దూరంగా వుంటే మంచిది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. అకారణంగా ఆందోళనకు లోనవుతారు. కోర్టు విషయాలు సానుకూలంగా ఉంటాయి. ఉద్యోగులకు ఆశించిన ఫలితాలు ఉంటాయి. అదనపు ఆదాయ మార్గాలకై అన్వేషిస్తారు. ప్రయాణాల్లో విలువైన వస్తువుల పట్ల జాగ్రత్త.

## వృశ్చికం



విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడుపుతారు. ఆర్థికంగా బాగుంటుంది. అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. వ్యాపారులు అధిక రుణాలు చేస్తారు. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. వివాదాలకు దూరంగా వుండడం మంచిది. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి.

## ధనుస్సు



మానసిక ప్రశాంతత కరువవుతుంది. తీర్థ యాత్రలు చేస్తారు. వ్యాపారులకు లాభాలు బాగుంటాయి. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. వృత్తి రంగాల్లో వున్నవారికి పోటీ వున్నా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. ఉద్యోగులు ఉన్నతాధికారులతో మాట్లాడేప్పుడు సంయమనం పాటించడం మంచిది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి.

## మకరం



దేశాంతర ప్రయాణం చేస్తారు. వృత్తి వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది. శుభ కార్యాల్లో పాల్గొంటారు. పాప కార్య చింతన మంచిది కాదని తెలుసుకుంటారు. ఆచి తూచి మాట్లాడటం చాలా అవసరం. క్రయ-విక్రయాలు సామాన్యం. పేరు ప్రతిష్ఠలు పొందుతారు. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. కుటుంబ సమస్యలు తీరి ప్రశాంతత ఏర్పడుతుంది. వాహన యోగం. ముఖ్యమైన పనులు పూర్తి.

## కుంభం



స్త్రీలకు శుభ యోగం. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం ఏమాత్రం మంచిది కాదు. మీ శక్తి సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. కుటుంబ సమస్యలు తీరి ప్రశాంతత లభిస్తుంది. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలన సూచనలు న్నాయి. వ్యతిరేకతలు ఎదురైనా సకాలంలో పనులు పూర్తి చేస్తారు.ధర్మ రక్షణకై పాటుపడతారు. చిరు వ్యాపారులకు లాభం.

## మీనం



రుణాలు తీర్చడంలో ఇబ్బందులు ఉంటాయి. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. ధర్మ రక్షణకై పాటుపడతారు. ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. బంధు, మిత్రులతో మనస్పర్థలకు అవకాశం. క్రయ-విక్రయాలు లాభదాయకం. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి. వృత్తి విద్యా కోర్సులు అభ్యసించిన వారికి బాగుంటుంది. విందు-వినోదాల్లో పాల్గొంటారు. ఖర్చులు అధికంగా ఉంటాయి.

# పశ్చిమ దిక్కులో బావి ఉండవచ్చా?


వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్: 9885446501/9885449458




## పశ్చిమ వాయవ్య బావిపోటు-అశుభం

ఇంటికి పశ్చిమ వాయవ్యంలో బావి ఉండకూడదు. ఇంటి ఉత్తర గోడ పారు నుండి పశ్చిమ ప్రహరీగోడకు తాడు లాగినప్పుడు అది బావి మీదుగా పోతే, ఆ ఇంటికి పశ్చిమ వాయవ్య బావిపోటు ఉన్నట్లుగా గమనించాలి. **శుభా శుభ ఫలితాలు:**అనారోగ్యం, అప్రయోజకత్వం

### West North-Western Well(Strike)-unfavourable

There should not be a well in the West North-West of a house. If a string, held straight from the boundary of the Northern wall of the house to the Western compound wall, goes over the well it should be considered as the strike of the West North-West well.

**Likely Result:** Ill-health, lack of initiative.

## పశ్చిమ బావి(ఉచ్ఛమ స్థానం)-అశుభం

ఇంటిలో పశ్చిమంలో ఉన్న బావి ఉచ్ఛస్థానమయిన, పశ్చిమ వాయవ్యానికి దగ్గరగా ఉన్నప్పుడు, ఏ విధమైన పోట్లు లేకపోయినప్పటికీ సత్ఫలితాలనివ్వదు. ఈ బావిచుట్టూ వుండే నేల సాధారణంగా పశ్చిమ వాలుగా ఉంటుంది. అలా వుంటే చెడు ఫలితాల తీవ్రత ఎక్కువవుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** అనారోగ్యం, వాయిదాలు, వ్యాజ్యాలు.

### Western Well(High-grade location)-unfavourable

A well to the West of the house and near to the uchha-sthana of West North-West, which has no strike of any kind and does not give any favourable result. The ground surrounding the well generally slopes towards the West. When it is so the unfavourable effects get increased.

**Likely Result:** Ill-healthk, litigation, debts.

## పశ్చిమ బావి(మధ్యమ స్థానం)అశుభం

పూర్తి పశ్చిమంలో బావి ఉన్నప్పుడు సత్ఫలితాలుండవు. ఈ బావి చుట్టూ వుండే నేల సాధారణంగా పశ్చిమ వాలుగా వుంటుంది. అలా వుంటే చెడు ఫలితాల తీవ్రత ఎక్కువవుతుంది. **శుభా శుభ ఫలితాలు:** ఇంటి యజమానికి వ్యాపార వ్యవహారాలలో అపజయాలు, అడ్డంకులు, క్రమంగా నిరాసక్తత.

### Western Well(Medium–grade location)-unfavourable

A well wholly in the West does not give any favourable result. The ground surrounding the well generally slopes towards the West. When it is so the unfavourable effects get increased.

**Likely Result:** Obstacles and failure in business for the Head of the family, gradual insovency.

## పశ్చిమ బావి(నీచ స్థానం)-అశుభం

పశ్చిమపు మధ్య భాగం నుండి నీచ స్థానమయిన పశ్చిమ నైరుతి వైపు బావి ఉన్నట్లయితే దానికి ఎటువంటి పోట్లు లేకపోయినపటికీ సత్ఫలితాలుండవు. నేల నైరుతి పల్లం అయితే చెడు ఫలితాలు తీవ్రతరం అవుతాయి.

**శుభాశుభ ఫలితాలు:** వ్యాపార వ్యవహారాలలో నష్టాలు, అనారోగ్యం, ప్రమాదాలు వాటిల్లే సూచన.

### Western Well(Low grade location)-unvafourable

If a well is located between the middle of the West and the low-grade location of West South-West and even when it does not have any kind of strike it does not give any favourable result. If the ground surrounding the well slopes towards the South-West the unfavourable effects get increased. **Likely Result:** Losses in business, ill-health, likelihood of accidents.

## పశ్చిమ నైరుతి బావిపోటు -అశుభం

ఇంటి దక్షిణ గోడ పారు నుండి, పడమర ప్రహరీగోడకు తాడు పట్టి లాగినప్పుడు అది బావి మీదుగా పోతే ఆ ఇంటికి పశ్చిమ నైరుతి బావిపోటు ఉన్నట్టుగా గుర్తించాలి. నేల పశ్చిమ/ నైరుతి పల్లం అయితే చెడు ఫలితాలు తీవ్రతరం అవుతాయి. **శుభా శుభ ఫలితాలు:**ప్రమాదాలు, అనారోగ్యం, ధన నష్టం, ప్రాణహానికి అవకాశం.



### West South-Western Well(Strike)-unfavourable

When a string, held straight from the boundary of the Southern wall of the house to the Western compound wall, passes over the well it means that the house has the strike of the West South-Western well. If the ground surrounding the well slopes towards the West or South-West the unfavourable effects get increased.

**Likely Result:** Accidents, ill-health, monetary losses, likelihood of loss of life. ■

# పుట్టినరోజు జేజేలు!

**శోలింగరం రాజు శుక్ర, శని, ఆదివారాలు.. మూడు రోజుల పాటు నిశ్శంకుదుర్గం అడవుల్లోకి వేటకు వెళ్లాడు. రాజ్యం క్షేమ సమాచారాలు చూసుకొమ్మని రాణి శకుంతమణికి చెప్పి వెళ్లాడు.**

**చాన్నాళ్లుగా రాణికి ఒక కోరిక ఉండేది. అది ఏమిటంటే– 'భార్య పుట్టిన రోజును మరిచిపోయే భర్తలకు జరిమానా విధించాలని'.**

దాని అమలుకోసం ఎన్నాళ్లుగానో ఎదురు చూసిన రాణి, రాజు అడవులకు వెళ్లిన ఈ సమయమే మంచి అవకాశమని భావించింది. శుక్రవారం రోజు అదే విషయాన్ని భటులచేత రాజ్యమంతా దండోరా వేయించింది. ఈ వింత శిక్షకు పుర ప్రజలు ముక్కు మీద వేలు వేసుకున్నారు.

కనీసం భార్య పుట్టినరోజును కూడా గుర్తు పెట్టుకోని భర్తలకు తన చర్య వల్ల బుద్ధి వస్తుందని రాణి భావించింది.

గతంలో జరిగింది వదిలేసి, ఇకపై భార్య పుట్టిన రోజులను గుర్తు పెట్టుకుంటామని భర్తలు కాళ్ల బేరానికి వస్తారని ఆశించింది. అయితే మరుసటి రోజైన శనివారంనాడు భర్తలెవరూ రాణిని కలవడానికి రాలేదు.

భార్యలు మాత్రం దండిగా రాణి మందిరానికి వచ్చారు. "మట్టిని నమ్ముకుని పని చేసుకునే రైతు కుటుంబాలు మావి. రెక్కాడితే కానీ డొక్కాడదు మాకు. పంటలు పండితే పండుగ. కానీ, మా పుట్టిన రోజులు మాకు పండుగ కాదు. బతుకుబండి లాగే పనివత్తిడిలో తీరికగా పుట్టినరోజు పండుగలు చేసుకునే సమయం మాకు ఉండదు. ఆ రోజు కానుకలు ఇచ్చి పుచ్చుకోవాలన్న ఆలోచన మా భర్తలకిగానీ, మాకు కానీ ఉండదు. ఉన్నా సేద్యం పనులన్నీ పక్కన పెట్టి పుట్టినరోజులు జరుపుకోవాలనిపించదు. దయచేసి మీరు ఈ ప్రతిపాదనను విరమించుకోండి" అని ప్రాధేయపడ్డారు. వారి మాటలకు రాణి ఆలోచనల్లో పడింది.

ఆదివారంనాడు చాలా మంది భర్తలు రచ్చబండ వద్ద చేరారు. "రాజు కత్తికే కాదు, రాణి కత్తికి కూడా రెండు వైపులా పదునే కదా!" అని భయపడ్డారు. తమలో తాము చర్చించుకుని గుంపుగా రాణి వద్దకు వచ్చి చేరారు.

"మాకు మా భార్యలంటే ప్రేమ లేక కాదు 'భార్య మాట బతుకుబాట' అని మాకు తెలుసు. ఏ రోజు ఎలా ఉంటుందో తెలియని జీవితాలు మా రైతులవి. రాత్రింబవళ్లూ మనసంతా పొలం మీద, ఫలితం మీద ఉంటుంది. సంసారనావ నడపటంలో తలమునకలై వారి పుట్టినరోజులను పొరపాటుగా మరిచిపోతాం. అంతేకానీ వారిని నిర్లక్ష్యం చేయాలని మాత్రం కాదు. మీ నిర్ణయాన్ని పునరాలోచించండి" అని వేడుకున్నారు.

**"కింది నలుపెరుగని గురువిందగింజ పరిస్థితే అయ్యిందే నా పరిస్థితి" అని మనసులో అనుకున్నాడు. చిన్నగా తలని రాణి వైపు తిప్పి "ఇంకెప్పుడూ మరవను, నాకు జరిమానా వెయ్యవు కదా.." అని వేడుకోలుగా చూశాడు.**

"వారు చెప్పింది నిజమే కదా" అని రాణి మరింత ఆలోచనల్లో పడింది.

మూడు రోజుల వేటకు వెళ్లిన రాజు సోమవారంనాడు రానేవచ్చాడు. రాణి ప్రతిపాదన తెలుసుకుని ఆశ్చర్యపోయాడు. విషయాన్ని సర్దుబాటు చేయకుండా ఆలస్యం చేస్తే రాజ్యంలో అశాంతి ప్రబలుతుందని గ్రహించాడు. వెంటనే రాజ్యంలోని భార్యలని, భర్తలని సమావేశపరిచాడు.

భర్తలని ఉద్దేశించి ఇలా ప్రసంగించాడు...

"అన్నిటిలోనూ సగభాగమైన భార్యలను నిర్లక్ష్యం చేస్తున్నారేమోనని రాణిగారు ఆవేదనతో తీసుకున్న నిర్ణయం అది. కుటుంబ నిర్వహణలో వారి అమోఘమైన పాత్రను భర్తలు గుర్తించాలి.

ఏమాత్రం అవకాశం ఉన్నా భార్యల పుట్టినరోజునాడు ఉన్నంతలో ఇంట్లో తీపి వంటలు చేసుకోండి. దగ్గర్లోని ఏదో ఒక గుడికో, గోపురానికో వెళ్లండి. మీతో పాటు పిల్లలను కూడా తీసుకెళ్లండి. పెద్దలను అనుసరించే గుణం ఉన్న పిల్లలను తీసుకెళ్లడం వల్ల కుటుంబంలో ప్రేమానురాగాలు వెల్లివిరుస్తాయి.

రాణిగారు చెప్పిన జరిమానా, భార్యలని పూర్తిగా పట్టించుకోనివారికే అమలవుతుంది. అది కూడా భార్యలు వచ్చి మాకు ఫిర్యాదు చేస్తేనే" అని వివరించాడు.

రాజుగారి మాటలకు భర్తలు ఎగిరి గంతులేశారు. భార్యలు ఆనందంతో మంగళసూత్రాలను కళ్లకద్దుకున్నారు. వెంటనే ఇండ్లకు వెళ్లి తియ్యటి బెల్లంపొంగలి తయారు చేశారు. అరటి ఆకుల్లో రాజు, రాణిలకు కానుకగా అందించారు.

వేడి వేడి బెల్లం పొంగలి ఆవురావురుమని తింటున్నాడు రాజు. నేతిలో వేయించిన జీడిమామిడి పలుకు ఒకటి రాజు పంటి కింద పడింది. దాని రుచికి తన్మయుడై కొద్దిసేపు కళ్లు మూసుకున్నాడు. మెరుపులాగా గుర్తుకొచ్చింది "రాణిగారి పుట్టినరోజు నిన్న ఆదివారమే కదా" అని.

గత ఏడాది కూడా ఇలాగే గ్రామ పర్యటనలో ఉండి మరిచిపోయి ఆమె కోపతాపాలకు గురి కావడం జ్ఞాపకానికి వచ్చాయి.

"కింది నలుపెరుగని గురువిందగింజ పరిస్థితే అయ్యిందే నా పరిస్థితి" అని మనసులో అనుకున్నాడు.

చిన్నగా తలని రాణి వైపు తిప్పి "ఇంకెప్పుడూ మరవను, నాకు జరిమానా వెయ్యవు కదా.." అని వేడుకోలుగా చూశాడు.


తప్పు తెలుసుకున్న రాజును చూసి ముసి ముసి నవ్వులు నవ్వింది రాణి. తన అరటి ఆకులోని బెల్లం పొంగలి కొంచెం తీసి అతడి అరటి ఆకులోకి వేసింది.


ఇద్దరూ హాయిగా నవ్వుకుంటూ తృప్తిగా బెల్లంపొంగలి తిన్నారు.

**- ఆర్.సి.కృష్ణస్వామి రాజు**

ఈ వారం కా'ర్టూన్స్'


Zakir...



ఇంకో పది రోజులు
బయటకు రాకూడదు.. జాగ్రత్త..!!
Zakir...


ముప్పై ఏళ్లయ్యింది వాడు మాట్లాడక.. 'బలగం' చూసి కూడా
వాడికి బుద్ధి మారలేదు.. నేనెందుకు మాట్లాడాలి వాడితో..!!?
Zakir...



# ఫోటో ఫీచర్





ఇంగ్లండ్‌లోని

ఈ కుగ్రామం పేరు బర్టన్ ఆన్ ద వాటర్. ఈ ఊరిలోని ఇళ్లన్నీ ఒకే విధంగా వుండి థీమ్ పార్క్‌ని తలపిస్తాయి. పాతకాలం పద్ధతిలో నిర్మించిన పెంకుటిళ్లు ఇవి. నది మధ్యలో ఉన్న ఈ గ్రామం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది.



